జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.


ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | ఆదివారం 25 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 255 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



# ఇక సీఎంవో ప్రక్షాళన

**కూటమి ప్రభుత్వం ఏర్పాటై మరికొద్ది రోజుల్లో ఏడాది కావొస్తుంది**

**ఏడాది పాలనలో ప్రభుత్వ పనితీరుపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి.**

**పాలనా వ్యవహారాలకు కేంద్ర స్థానమైన సీఎంఓలో కూడా త్వరలో బదిలీలు జరుగుతాయని జోరుగా ప్రచారం**

**ప్రస్తుతం ఏపీ సీఎం పేషీలో ఇద్దరు అధికారుల హవా నడుస్తోంది.**



**అమరావతి**

ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై మరికొద్ది రోజుల్లో ఏడాది కావొస్తుంది. ఏడాది పాలనలో ప్రభుత్వ పనితీరుపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఈ క్రమంలో కొందరు ఐఏఎస్ అధికారుల తీరుపై విమర్శలు, ఆరోపణలు కూడా వచ్చాయి. పాలనా వ్యవహారాలకు కేంద్ర స్థానమైన సీఎంఓలో కూడా త్వరలో బదిలీలు జరుగుతాయని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ 4తో ఏడాది పూర్తవుతుంది. ఈ క్రమంలో ఆలిండియా సర్వీస్ అధికారుల పనితీరుపై శాఖల వారీగా ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి ఆశించిన స్థాయిలో సీఎంఓలో కొందరు పనితీరు లేదనే వాదనలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో శాఖల వారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలతో పాటు సీఎంఓ ప్రక్షాళన కూడా జరుగుతుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం సీఎంఓలో ఉన్న ఒకరిద్దరు అధికారులకు తప్ప మిగిలిన వారికి స్థాన చలనం తప్పదని సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఏపీ సీఎం పేషీలో ఇద్దరు అధికారుల హవా నడుస్తోంది. వారిలో ఒకరు వైసీపీ ప్రభుత్వ హయంలో ఢిల్లీలో పనిచేశారు. మరొకరు వైసీపీ బాధిత అధికారిగా ప్రచారం పొందారు. ఈ క్రమంలో ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రితో కలిసి చదువుకున్న ఐఏఎస్ అధికారితో పాటు, మరో ముఖ్యమైన అధికారి తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. సీఎంలో ఉన్న అధికారుల్లో ఒకరు గతంలో ఢిల్లీలో పనిచేశారు. ఢిల్లీ అధికార వర్గాల్లో విస్తృత పరిచయాలు ఉన్నాయి. ఆ కోటాలోనే ఆయనకు సీఎంఓలో ప్రాధాన్యత దక్కింది. అయితే ఏడాది కాలంలో రాష్ట్రానికి ఆయన ద్వారా కలిగిన ప్రయోజనం ఏమిటనే చర్చ కూడా ప్రభుత్వ వర్గాల్లో ఉంది. మరో ముఖ్యమైన - మిగతా3లో



## చల్లని కబురు..

- కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు
- ఈ మేరకు వాతావరణ శాఖ ఓ ప్రకటన
- నైరుతి రుతుపవనాలు రాకతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో వర్షం
- కేరళ రాజధాని తిరువనంతపురంలో గాలి వాన బీభత్సం



## విండోషేడ్స్ మూసి ఉంచాలి

- వాణిజ్య విమానాలకు డీజీసీఏ కీలక సూచన
- మరీ ముఖ్యంగా పాక్‌తో సరిహద్దు ఉన్న పశ్చిమ భారత స్థావరాల వద్ద ఈ సూచన తప్పక పాటించాలి
- విమానం టేకాఫ్ అయిన తర్వాత 10వేల అడుగుల ఎత్తుకు వెళ్లేవరకు, ల్యాండింగ్ సమయంలో ఈ ఎత్తుకు దిగిన తర్వాత ఆ నిబంధన వర్తిస్తుంది.

## 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో

# ప్రణాళికలు

- నీతి ఆయోగ్ భేటీలో చంద్రబాబు
- చంద్రబాబు ప్రజంటేషన్‌కు సమావేశంలో పెద్ద ఎత్తున ప్రశంసలు
- ఎన్డీఏ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు
- దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే అంశాలను తన ప్రజంటేషన్‌లో ప్రస్తావించారు.
- విశాఖకు గ్లోబల్ హంగులు అద్దేలా నాలుగు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలి



**ఢిల్లీ:**

నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రపై నివేదిక ఇచ్చారు. పహల్గాం ఉగ్ర దాడిని ఖండిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే అంశాలను తన ప్రజంటేషన్‌లో ప్రస్తావించారు. చంద్రబాబు ప్రజంటేషన్‌లోని వివిధ అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు. - మిగతా3లో



## గత ప్రభుత్వం ఛీత్కారాలను

# మర్చిపోయారా..

డిప్యూటీ సీఎం పవన్ పేషీ..

తెలుగు సినిమా సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారా

ఇకపై ప్రభుత్వంతో వ్యక్తిగత చర్చలు ఉండవని, సినిమా సంఘాల ప్రతినిధులే రావాలని స్పష్టం

కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు.. సినిమా రంగం అభివృద్ధినే చూస్తుంది.

## శరవేగంగా కోవిడ్ వ్యాప్తి.. ఆసుపత్రుల్లో హైఅలర్ట్

- జేఎన్.1 వేరియంట్ నుంచి పుట్టుకొచ్చిన మరో కొత్త వేరియెంట్లు ఎల్ఎఫ్.7, ఎన్బీ.1.8.1
- ఏడాదిన్నర తర్వాత పలు రాష్ట్రాల్లో కోవిడ్-19 కేసులు నమోదు
- తెలుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాల్లో వైరస్ లక్షణాలతో ఆస్పత్రుల్లో బాధితులు చేరుతున్నప్పటికీ.. అధికారికంగా మాత్రం ప్రకటించడం లేదు.




## కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురి మృతి
- రాయచోటి నుంచి కడపకు కారులో వస్తుండగా ఈ ప్రమాదం



## 200 మంది ఉగ్రవాదుల్ని లేపేశారు..

# మహిళా పైలట్లకు బిగ్ సెల్యూట్!



పహల్గాం దాడితో అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో గట్టిగా బుద్ధి చెప్పింది భారత్. 9 ఉగ్రస్థావరాలపై అటాక్ చేసి 100 మందికి పైగా టెర్రరిస్టులను మట్టుబెట్టింది. ఆ తర్వాత ఎదురుదాడికి దిగిన పాకిస్థాన్‌కు మూడు చెరువుల నీళ్లు తాగించారు మన సైనికులు. డ్రోన్లు, క్షిపణులతో పాక్ ఆర్మీ పోస్టులు, ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశారు. దీంతో భయపడ్డ పాక్.. కాల్పులు ఆపండి మహాప్రభో అంటూ కాళ్ల బేరానికి వచ్చింది. ఇప్పుడు ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఆపరేషన్ సిందూర్ ముగిసిందని చాలా మంది అనుకుంటున్నారు. అయితే మన సైనికుల వీరగాథలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. మే 7వ తేదీన జరిపిన దాడిలో భారత మహిళా పైలట్లు ఏకంగా 200 మందికి పైగా టెర్రరిస్టులను లేపేశారని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. వీరిలో 170 మంది టెర్రరిస్టులు, 42 మంది శత్రుదేశ సైనికులు ఉన్నట్లు స్పష్టం చేశాయి.

**వారిదే ప్రధాన పాత్ర!**

పాకిస్థాన్‌లోని కీలక ఉగ్రస్థావరాలు ముఖ్యంగా బహావల్‌పూర్‌లోని జైషే మహ్మద్ టెర్రర్ క్యాంప్ పూర్తిగా ధ్వంసమైందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఉగ్రవాది మౌలానా మసూద్ అజహర్ కుటుంబంలోని చాలా మంది హతమయ్యారని పేర్కొంది. ఈ వైమానిక దాడుల్లో భారత మహిళా పైలట్లు కీలక పాత్ర పోషించారని వివరించింది. బ్రహ్మోస్ క్షిపణులు అద్భుతంగా పని చేశాయని స్పష్టం చేసింది. మే 7న జరిపిన దాడులతో పాటు మే 9, 10 తేదీల్లో పాకిస్థాన్‌లోని సర్గోదా, రహీం యార్ ఖాన్, నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌లపై జరిపిన దాడుల్లోనూ భారత మహిళా పైలట్ల పాత్ర ఎంతో కీలకమని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. దీంతో మహిళా పైలట్ల మీద ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి. వారికి బిగ్ సెల్యూట్ అని సోషల్ మీడియాలో నెటిజన్స్ అంటున్నారు. ఇదీ ఇండియా పవర్ అని కామెంట్స్ చేస్తున్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని అధికారిక వర్గాలు చెప్పాయి. భద్రతా బలగాలు ఇంకా హైఅలర్ట్‌లో ఉన్నాయని వెల్లడించాయి.

# ట్రంప్.. మరో షాక్...

## 788 మంది భారతీయ విద్యార్థుల పరిస్థితేలంటి?



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్-హార్వర్డ్ యూనివర్సిటీ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత ఆగే సంకేతాలు కనిపించడం లేదు. ఇంతలో, ట్రంప్ ప్రభుత్వం ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. విదేశీ విద్యార్థులు ప్రస్తుతానికి హార్వర్డ్‌లో ప్రవేశం పొందలేరు. విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని నిలిపివేసిస్తూ ట్రంప్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. దీంతో భారతదేశం తోపాటు ప్రపంచంలోని ఇతర దేశాల విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టి నోయెమ్, ఈ మేరకు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి లేఖను పంపారని న్యూయార్క్ టైమ్స్ ఈ వార్తను అందించింది. "హార్వర్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థి, విద్యా మార్పిడి ప్రవేశ కార్యక్రమం గుర్తింపు రద్దు చేస్తున్నట్లు తెలియజేయడానికి లేఖ వ్రాస్తున్నాను, ఇది వెంటనే అమలులోకి వస్తుంది" అని నోయెమ్ లేఖలో రాశారు. హార్వర్డ్ అధికారిక రికార్డుల ప్రకారం, ప్రతి సంవత్సరం 500 నుండి 800 మంది భారతీయ విద్యార్థులు ఇక్కడ ప్రవేశం పొందుతున్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచం నలు మూలల నుండి దాదాపు 6,800 మంది విద్యార్థులు ఇక్కడికి వస్తారు. ఈ సంవత్సరం 788 మంది భారతీయ విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇప్పుడు అలాంటి పరిస్థితిలో, ఈ విద్యార్థుల సమస్యలు పెరగబోతున్నాయి. విదేశీ విద్యార్థులు వేరే సంస్థలో అడ్మిషన్ తీసుకోవాలని లేదా అమెరికాలో వారి చట్టపరమైన హోదాను కోల్పోవాలని కోరారు. అందువల్ల, భారతీయ విద్యార్థులు మరొక సంస్థలో ప్రవేశం పొందే అవకాశం ఉంటుంది. వారు అలా చేయకపోతే, వారు అమెరికా వదిలి వెళ్ళవలసి రావచ్చు. హార్వర్డ్‌లో ప్రస్తుత సెమిస్టర్ పూర్తి చేసిన విద్యార్థులకు మాత్రం ఒక ఉపశమన వార్త. వారు తమ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగలుగుతారు. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం కార్యదర్శి క్రిస్టి నోయెమ్ తన లేఖలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ట్రంప్ ప్రభుత్వం చేసిన మార్పు 2025-26 విద్యా సంవత్సరం నుండి అమలు చేయడం జరుగుతుందని ఆయన రాశారు. డొనాల్డ్ ట్రంప్-హార్వర్డ్ మధ్య వివాదం నెలకొంది. ట్రంప్ పరిపాలన తన సొంత కోరికల ప్రకారం విశ్వవిద్యాలయాన్ని నడపాలని కోరుకుం టుంది. కానీ హార్వర్డ్ దీనికి పూర్తిగా సిద్ధంగా లేదు. యూదు లపై ద్వేషాన్ని ఆపడంలో హార్వర్డ్ విఫలమైందని ట్రంప్ ఆరో పించారు. యూదు విద్యార్థులు, ప్రొఫెసర్లపై వివక్ష ఉందని ట్రంప్ సర్కార్ ఆరోపించింది. ఇప్పుడు విదేశీ విద్యార్థుల విషయంలో ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విశ్వవి ద్యాలయంపై పెరుగుతున్న ఒత్తిడి ఇదే అనిపిస్తుందంటున్నారు నిపుణులు.

## అయోధ్యలో వేగంగా రామమందిర పనులు

# సప్త మందిర విభాగం నిర్మాణం పూర్తి



**లక్నో :** అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయ నిర్మాణ పనులు ఇప్పుడు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఆలయ నిర్మాణం పనులకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఈరోజు పంచుకున్నారు. రామ దర్బారలో ప్రతిష్టించాల్సిన దైవిక విగ్రహాలు ఈ రోజు ఎప్పుడైనా ఆలయ ప్రాంగణానికి చేరుకోవచ్చని చెప్పారు. ఈ విగ్రహాలను మొదటి అంతస్తులో ప్రతిష్టిస్తారు. రామ దర్బార్ లో శ్రీరాముడు, సీత దేవి, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు కొలువు దీరనున్నారు. ప్రాణ ప్రతిష్ఠకి సంబంధించిన మతపరమైన ఆచారాలు జూన్ 3 నుంచి ప్రా రంభమై జూన్ 5న ముగుస్తాయి. ఈ ప్రత్యేక సందర్భానికి ముందు.. ప్రధాన ఆలయ నిర్మాణ పనులన్నీ పూర్తవుతాయి. ప్రాకారము, శేషావతార ఆలయం వంటి మిగిలిన నిర్మాణం పనులు సెప్టెంబర్ , అక్టోబర్ మధ్య పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పారు. సప్త మందిర విభాగం నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. అక్కడ ఋషులు, సాధువుల విగ్రహాలను ప్రతిష్టించారు. అంతేకాదు ఈ ఆలయం మధ్యలో ఉన్న పుష్కరణి నిర్మాణం కూడా పూర్తయింది. నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ప్రకారం.. 2020 లో నిర్ణయించిన నిర్మాణ ప్రణాళికలోని అన్ని పనులు 2025 ఏడాది చిరకి పూర్తవుతా యి. ఆలయానికి సంబంధించిన గేట్ల గురించి మాట్లాడు కుంటే.. నాలుగు ప్రధాన గేట్లు నిర్మిస్తున్నారు. వీటిలో ఉత్తర ద్వారం మే నాటికి సిద్ధంగా ఉండాల్సి ఉంది.. అయితే నిర్మాణంలో తలెత్తిన కొన్ని సాంకేతిక అడ్డంకుల కారణంగా.. ఈగేటు ఇప్పుడు జూన్ 30 నాటికి పూర్తవుతుంది. దీని తరు వాత గేట్ నంబర్ 11 నిర్మాణం ఆగస్టు చివరి నాటికి పూర్తవు తుంది. గేట్ నంబర్ 3 నిర్మాణం పని ప్రారంభమవు తుంది. దీనితో పాటు ఆడిటోరియం, అతిథి గృహం, ఇతర సౌకర్యాల నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. రామమందిర నిర్మాణం షెడ్యూల్ ప్రకారం జరుగుతోంది, త్వరలో ఈ దివ్య నివాసం పూర్తవుతుందని చెప్పారు నృపేంద్ర మిశ్రా.

## శరవేగంగా కోవిడ్ వ్యాప్తి..

## ఆసుపత్రుల్లో హైఅలర్ట్



**న్యూఢిల్లీ:** దేశంలో కరోనావైరస్ మరోసారి విజృంభిస్తోంది. ఈసారి కొత్త ఉపరకాల రూపంలో కలకలం సృష్టిస్తోంది. దాదాపు.. ఏడాదిన్నర తర్వాత పలు రాష్ట్రాల్లో కోవిడ్-19 కేసులు నమోదు అవుతున్నాయి. మరీ ముఖ్యంగా గ్రామీణేతర ప్రాంతాల్లోనే వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది. జేఎన్.1 వేరియంట్ నుంచి పుట్టుకొచ్చిన మరో కొత్త వేరియెంట్లు ఎల్ఎఫ్.7, ఎన్బీ.1.8.1 భారత్‌లో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కొత్త కేసులు వెలుగు చూశాయి. ఏడాదిన్నర తర్వాత ఒడిషాలో కొత్త కేసు నమోదుకాగా, రాజధాని రీజియన్‌లో మూడేళ్ల తర్వాత కోవిడ్ కేసులు అత్యధికంగా నమోదు అయ్యాయి. కేరళలో గరిష్టంగా 273 కోవిడ్ కేసులు, కర్ణాటకలో 35, మహారాష్ట్ర ముంబైలో 95.. థానేలో 10, ఢిల్లీలో 23 కేసులు రికార్డయ్యాయి.

తెలుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాల్లో వైరస్ లక్షణాలతో ఆస్పత్రుల్లో బాధితులు చేరుతున్నప్పటికీ.. అధికారికంగా మాత్రం ప్రకటించడం లేదు. అదే సమయంలో కేంద్ర ఆరోగ్య శాఖ కూడా రాష్ట్రాల కోసం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) జేఎన్.1 వేరియంట్‌ను దాని వేగవంతమైన వ్యాప్తి కారణంగా 'వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్'గా వర్గీకరించింది. కానీ, ప్రస్తుతానికి 'వేరియంట్ ఆఫ్ కన్సర్న్'గా ప్రకటించలేదు. మరోవైపు.. శరవేగంగా కొత్త వేరియెంట్లు వ్యాప్తిస్తున్నప్పటికీ.. లక్షణాలు మాత్రం స్వలంగానే ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కొత్త ఉపరకాల లక్షణాలు సాధారణంగా గతంలోని ఒమిక్రాన్ వేరియంట్ల మాదిరిగానే ఉంటున్నాయి. గొంతు నొప్పి, తేలికపాటి దగ్గు, అలసట, జ్వరం వంటివి ప్రధాన లక్షణాలుగా కన్పిస్తున్నాయి. అయితే, డెల్టా వంటి పాత వేరియంట్లలో కనిపించిన రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు ఈ కొత్త వేరియంట్ల బారిన పడినవారిలో అంతగా కనిపించడం లేదని వైద్యులు చెబుతున్నారు.

**భారీగా పెరుగుతున్న కరోనా, దేశంలో పెహైఅలర్ట్..**

**ఆస్పత్రుల్లో హైఅలర్ట్**

కోవిడ్ బారినవారు నాలుగు రోజుల్లోనే కోలుకుంటున్నారని ఇండియా కరోనా ట్రాకర్ ఆధారంగా.. ఇండియా టుడే తన కథనంలో పేర్కొంది. హైదరాబాద్(తెలంగాణ)లో పేషెంట్ల కోసం ముందస్తుగా పరీక్ష చేసుకున్న ఓ వైద్యుడికి కోవిడ్ నిర్ధారణ అయ్యింది. అయితే ఆయన స్వల్ప జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వైరస్ వ్యాప్తితో లక్షణాలు స్వలంగా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నప్పటికీ.. ముందస్తు జాగ్రత్తగా పలు రాష్ట్రాలు కోవిడ్-19 మార్గదర్శకాలను జారీ చేశాయి. మాస్క్ తప్పనిసరిగా ధరించాలని, శుభ్రత.. వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరుతున్నాయి. ఆసుపత్రులలో పడకలు, ఆక్సిజన్, మందులతో ప్రత్యేక వార్డులను సిద్ధం చేస్తున్నాయి. అయితే అధిక ప్రమాదం ఉన్నవారు (వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు) బూస్టర్ డోస్ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## చల్లని కబురు..




తిరువనంతపురం: దేశంలో రైతులకు శుభవార్త. నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. సాధారణం కన్నా 8 రోజులు ముందుగానే ఈ రుతుపవనాలు కేరళలో ప్రవేశించాయి. ఈ మేరకు వాతావరణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. రుతు పవనాల ఎఫెక్ట్‌తో కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక, నైరుతి రుతుపవనాలు రాకతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. కేరళ రాజధాని తిరువనంతపురంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలుల కారణంగా భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. దీంతో, మున్సిపల్ శాఖ సిబ్బంది రోడ్లపై విరిగిపడిన చెట్లను తొలగిస్తున్నారు.

## పాక్ సరిహద్దుల్లో విండోషేడ్స్ మూసి ఉంచాలి..

## కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ:** రక్షణ శాఖ వైమానిక స్థావరాల్లో, మరీ ముఖ్యంగా పాక్‌తో సరిహద్దు ఉన్న పశ్చిమ భారత సరిహద్దుల వద్ద విమానాల టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో విండో షేడ్స్‌ను మూసివేయాలని వాణిజ్య విమానాలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ శనివారంనాడు కీలక ఆదేశాలు జారీ చేసింది. కిటికీలను వస్త్రంతో మూసి ఉంచటాన్ని విండో షేడ్స్ మూసి వేయడంగా వ్యవహరిస్తారు. విమానాలు 10 వేల అడుగుల పైకి వెళ్లేంత వరకూ, ల్యాండింగ్ సమయంలో అంతే ఎత్తుకు దిగిన తర్వాత ఈ నిబంధన వర్తిస్తుందని, ఎమర్జెన్సీ ఎగ్జిట్ కిటికీలకు మాత్రం ఈ నిబంధన వర్తించదని డీజీసీఏ ఆ ఆదేశాల్లో పేర్కొంది. విమానాల్లో రాకపోకలు సాగించే సమయంలో సైనిక స్థావరాల వద్ద ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉన్న నిషేధం గురించి ప్రయాణికులను అప్రమత్తం చేయాలని కూడా డీజీసీఏ కోరింది. సెక్యూరిటీ ప్రోటోకాల్ దృష్ట్యా ఈ చర్యలు అనివార్యమని, వీటిని ఉల్లంఘిస్తే ఎదుర్కోవాల్సిన లీగల్ చర్యల గురించి కూడా ప్రయాణికులకు వివరాలించాలని విమానయాన సంస్థల నిర్వాహకులకు స్పష్టం చేసింది. డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్‌ల నుంచి ఆపరేట్ చేస్తున్నప్పుడు సిబ్బంది భద్రత, సెక్యూరిటీ రిస్క్‌పై స్టాంటర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను అమలు చేయాలని ఆపరేటర్లకు డీజీసీఏ సూచించింది. ఆపరేషన్ సేఫ్టీతో పాటు ప్రయాణికులు తమకు తెలియకుండానే రక్షణ పరమైన సమాచారాన్ని షేర్ చేయకుండా నిరోధించేందుకు తాజా చర్యలు ఉపకరిస్తాయని పేర్కొంది. ముఖ్యంగా లెహ్, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, ఆదంపూర్, చండీగఢ్, బఠిండా, జైసల్మేర్, నల్, జోథ్‌పూర్, హిండన్, ఆగ్రా, కాన్పూర్, బరేలి, మహరాజ్‌పూర్, గోరఖ్‌పూర్, భుజ్, లొహెగావ్, గోవా (డాబోలిమ్), వైజాగ్‌లోని విమానాశ్రయాలు కచ్చితంగా ఈ ఆదేశాలను పాటించాల్సి ఉంటుందని తెలిపింది. ఇండియా, పాక్ ఉద్రిక్తతల నడుమ పలు సెన్సిటివ్ ఎయిర్ బేస్‌లతో సహా నార్త్, సెంట్రల్, వెస్ట్రన్ ఇండియాలోని 32 విమానాశ్రయాలను ఇటీవల కొద్దికాలం మూసి ఉంచారు. అయితే ఇప్పుడు ఫ్లయిట్ ఆపరేషన్లు పునరుద్ధరించినప్పటికీ భద్రతా ఆందోళనలు కొనసాగుతున్నాయి.

# సినిమా వాళ్లను బెదిరిస్తారా?

## పవన్ కళ్యాణ్‌పై పేర్ని నాని ఫైర్

**తాడేపల్లి:** చంద్రబాబు నాయకత్వంలో మహానాడు పేరుతో దగానాడు జరగుతోందని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. కేవలం ఏపీ లోని ప్రజలకే కాదు.. జెండా మోసిన కార్యకర్తలకు కూడా దగానాడే అంటూ ఆయన వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 15 ఏళ్ల ఆవేశం స్టార్, రెడ్ బుక్ స్టార్.. అందరికీ బాస్ అని చెప్పుకునే మోదీ కూడా ఏపీకి చేసిన మేలు ఏమైనా ఉందా?" అంటూ పేర్ని నాని నిలదీశారు. "ఎమ్మెల్యేలు ఏ ముఖం పెట్టుకుని జనాల్లోకి వెళ్లాలా అని సిగ్గు పడుతున్నారు. కడపలో జరిగేది మహానాడా.. దగానాడా.. వాళ్ళే చెప్పాలి. ఎన్టీఆర్ ఉన్నప్పుడు టీడీపీ వేరు.. ఇప్పుడు టీడీపీ వేరని కార్యకర్తలు ఏడుస్తున్నారు. తండ్రీకొడుకులు ఇద్దరూ మూటలు కట్టుకుంటున్నారు. ఒక చిన్న మూట ఇంకొకరికి ఇస్తున్నారు. పోలీసు వేధింపులకు దేశంలోనే నిలువుటద్దంలా ఏపీ నిలుస్తుంది. కస్టోడియల్ టార్చర్‌కి ఏపీ పోలీస్ స్టేషన్‌లు వేదికలుగా మారిపోతున్నాయి" అంటూ పేర్ని నాని మండిపడ్డారు. "లిక్కర్ కేసులో బెయిలుపై బయట తిరుగుతున్న చంద్రబాబు.. ఇప్పుడు లేని లిక్కర్ కేసును సృష్టించారు. లిక్కర్ కేసులో మొదట విజయసాయిరెడ్డిని లైన్‌లోకి తెచ్చారు. ఆయన పార్టీ నుంచి బయటకు వెళ్లటంతో కేసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని తెచ్చారు. ఆ తర్వాత జగన్ పేరు తెస్తారు. ఇసుమంత కూడా బిడియపడకుండా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. రోజుకో కథ వండి వారుస్తున్నారు. లక్షల కోట్ల పేజీల మెమరీ డిలీట్ చేశారని ఎల్లో మీడియా రాయిస్తున్నారు. చంద్రబాబు అరెస్ట్ అయినందున జగన్‌ని కూడా అరెస్ట్ చేయాలనే ఆలోచనలో ఉన్నారు. పీఎస్ఆర్ ఆంజనేయులుపై కక్షసాధిస్తున్నారు. జైలులో కూడా ఆయన నిత్య పూజలు చేసుకునే వ్యక్తి అని జైలు అధికారులే చెప్పుకుంటున్నారు. అరెస్ట్ అప్పుడే అన్నీ వెతికారు కదా.. మళ్ళీ ఇప్పుడు సోదాలు ఎందుకు?" అంటూ పేర్ని నాని ప్రశ్నించారు.





### ఫ్లాప్ సినిమాకు ఎందుకంత బిల్డప్

..రాజ్యమే ప్రజలను హింసిస్తే ఆ ప్రజల ఆగ్రహంలో పాలకులు కొట్టుకుపోతారు. చంద్రబాబు ఇంటికి కాయగూరలు కావాలంటే విమానంలో వెళ్లి తెచ్చుకుంటున్నారు. జగన్ లాగా నేను అప్పులు చేసి పథకాలు ఇవ్వను.. నేను సంపద సృష్టించి ఇస్తానని చెప్పారు. సంవత్సరం తిరిగే లోపు లక్షన్నర కోట్ల అప్పులు చేసి ఆ సొమ్మంతా ఏం చేశారు?. కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి ఇంట్ కరెంట్ కోసం యూనిట్ 9 రూపాయలు వసూలు చేస్తున్నారు. జగన్ తన ప్రభుత్వంలో తక్కువ రేటుకే ప్రజలు సినిమాలు చూడాలి అని ఆకాంక్షించారు. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. పవన్ కళ్యాణ్ సినిమా ఫీల్డ్‌ను ఉద్ధరిస్తారనుకుంటే థియేటర్ యాజమాన్యాలపై విచారణకు ఆదేశించారు.

..అప్పుడు ఏం మాట్లాడారు..? ఇప్పుడు ఏం చేస్తున్నారు..?. సినిమా వాళ్లను జైల్లో వేస్తామని బెదిరిస్తున్నారు. ఇవి దివాలకోరు రాజకీయాలు కావా..?. నీ చెప్పు చేతల్లో ఉన్న మంత్రితో బెదిరిస్తారా?. రాబోయే ఫ్లాప్ సినిమా కోసం ఇంతలా చేయాలా..?. గతంలో పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలు అందరికీ గుర్తున్నాయి.. సినిమా వాళ్ళను బెదిరించటానికి మీరు ఎవరు..?. అసలు వాళ్ల సమస్య ఏంటో తెలుసా మీకు" అంటూ పేర్ని నాని ప్రశ్నించారు.

# కూటమి కుంపట్లు...

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమిని ఏర్పాటు చేసుకుని అధికారంలోకి వచ్చారు కానీ, టీడీపీ నేతల్లో మాత్రం చాలా చోట్ల అసంతృప్తులు తలెత్తుతు న్నాయి. తెలుగుదేశం పార్టీకి యాభై వసంతాల చరిత్ర ఉండటంతో ఎందరో నేతలు ఉన్నారు. వారంతా ఎప్పుడు అధికారంలోకి వచ్చినా తమకు పదవులు గ్యారంటీ అన్న నమ్మకంతో ఉన్నారు. గతంలో బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ కమలం పార్టీకి తక్కువ స్థాయిలో పదవులు ఇచ్చేవారు. ఎక్కువ పదవులు తెలుగుదేశం పార్టీ నేతలకు ఇచ్చేవారు. కానీ ఈసారి మాత్రం మూడు పార్టీలు కలసిపోటీ చేయడంతో జనసేన, బీజేపీలకు కూడా పదవులు ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో టీడీపీ నేతలను పక్కన పెట్టాల్సి వస్తుంది. చంద్రబాబు నాయుడుకు పార్టీ నేతలకు పదవులు ఇద్దామని మనసులో ఉన్నప్పటికీ మిత్రులకు కూడా న్యాయం చేయాలని భావించి వారికి విధిలేని పరిస్థితుల్లో కేటాయించాల్సి వస్తుంది. ఇక ఈ సమస్య ఎక్కువగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లా టీడీపీనేతలు అసంతృప్తిగా ఉన్నట్లు వారి మాటలను బట్టి తెలుస్తుంది. మినీ మహానాడుల్లోనే ఈ విషయం బయటపడుతుంది. నేతలు తమకు పదవులు దక్కడం లేదన్న నిరాశలో ఉన్నారు. తాము కలసి పనిచేస్తేనే మొన్నటి ఎన్నికల్లో జనసేన గెలిచిందని, అయితే అన్ని పదవులు జనసేనకు కేటాయించడంపై టీడీపీ నేతలు అభ్యంతరం తెలుపుతున్నారు. నామినేటెడ్ పోస్టుల కోసం ఇన్నాళ్లు ఎదురు చూసిన నేతలు వరసగా జనసేన నేతలకు పదవులు దక్కుతుండటంతో సభల్లోనే ఓపెన్ అయిపోతున్నారు. తాము పార్టీ కోసం పడిన కష్టానికి ప్రతిఫలం ఎక్కడ అంటూ ప్రశ్నిస్తున్నారు. కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కూడా ఇదే తరహాలో



వ్యాఖ్యానించడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి ఇప్పటి వరకూ టీడీపీ ఇన్ ఛార్జిని నియమించకపోవడాన్ని కూడా తప్పుపడుతున్నారు. జనసేన ఎమ్మెల్యే అక్కడ ఉన్నప్పటికీ పార్టీ క్యాడర్ కోసం పనిచేయడానికి ఒక ఇన్ ఛార్జి కావాల్సి ఉంటుంది కదా? అని అంటున్నారు. అందుకే తూర్పు గోదావరి జిల్లా అంటే కేవలం జనసేన మాత్రమే కాదని, టీడీపీ తొలి నుంచి బలంగా ఉన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.. ఇక విశాఖ జిల్లాలోనూ సీనియర్ నేత బండారు సత్యనారాణమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గం అభివృద్ధి నిధులను తమకు ఎక్కువగా విడుదల చేయలేదని ఆయన అన్నారు. తన నియోజకవర్గంపై ఎందుకంత వివక్ష అంటూ అంటూ ఆయన ప్రశ్నించడమే కాకుండా తన నియోజకవర్గానికి కేవలం మూడు కోట్లు మాత్రమే కేటాయించారని, మిగిలిన నియోజకవర్గాలకు ఏడు కోట్ల రూపాయలు కేటాయించారని, ఇదెక్కడి న్యాయం అంటూ ప్రశ్నించారు. తన నియోజకవర్గ సమస్యలను పరిష్కరించలేక పోతున్నందుకు ప్రజలకు తానే క్షమాపణ చెబుతానని ఆయన అన్నారు. ఇలా రాయలసీమ, ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి జిల్లాల్లో తెలుగు తమ్ముళ్లలో ఈ రకమైన అసంతృప్తి ఉంది. మరి వీటిని ఎలా పారదోలతారన్నది చూడాల్సి ఉంది.

# వాళ్లకి నో ఎంట్రీ: జగన్ క్లారిటీ

**విజయవాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ తాను నమ్మిన వాళ్లే తనను మోసం చేశారన్న అభిప్రాయంలో ఉనట్లుంది. ఆయన వ్యవహారశైలి చూస్తుంటే అదే అర్ధమవుతుంది. తాను నమ్మి పదవులు ఇచ్చిన వారంతా కష్టకాలంలో వదలి పెట్టి వెళ్లిపోతున్న విషయాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగని వారిని ఆపేందుకు ఎలంటి ప్రయత్నమూ చేయలే దు. అందుకు ఇగో అడ్డువస్తుంది. వెళ్లేవారిని ఆగమంటే ఆగుతారా? అన్న ధోరణిలో జగన్ ఉన్నారని ఆయనకు సన్నిహితంగా ఉన్నవారు చెబుతున్నారు. ఇక ఎవరిని నమ్మాలి? అని జగన్ ఇటీవల జరిగిన నేతల సమావేశంలో జగన్ ప్రశ్నించినట్లు తెలిసింది. అధికారంలో ఉన్నప్పుడు పదవులు కట్టబెట్టినా తాను ఏం చేశానని నమ్మకద్రోహం చేసి వెళుతున్నారని జగన్ ఆవేదన చెందినట్లు సమాచారం. వైఎస్ జగన్ కు అత్యంత సన్నిహితులుగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, బాలినేని శ్రీనివాసులురెడ్డి, విజయసాయిరెడ్డి లు వెళ్లిపోవడం పైనే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. కిలారు రోశయ్యకు కూడా వాళ్ల మామకు మాత్రమే కాకుండా ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా అధికారం కోల్పోయిన వెంటనే పార్టీని వదిలివెళ్లిపోవడంపై జగన్ ఒకింత నిరాసక్తతను ప్రదర్శించారట. వీరికి తాను ఏం తక్కువ చేశానంటూ వైసీపీ నేతల వద్ద జగన్ వ్యాఖ్యానించారంటే వారి విషయంలో పార్టీ అధినేత ఎంతగా హర్ట్ అయ్యారో చెప్పకనే తెలుస్తుంది. కొందరు పదవులు ఇవ్వకపోయినా పార్టీని వదలి వెళ్లలేదని, అలాంటి వారికి మాత్రం అధికారంలోకి వచ్చిన తర్వాత అందలం ఎక్కించడం గ్యారంటీ అని కూడా చెబుతున్నారట. ఈ సందర్భంగా నేతలు ఆసక్తికరమైన విషయాన్ని జగన్ ముందు నేతలు ఉంచారట. పార్టీని వీడిన వెళ్లిన నేతలు అక్కడకు వెళ్లినా హ్యాపీగా లేరని, వారు ఎన్నికలకు ముందు తిరిగి వైసీపీలోకి వచ్చే అవకాశముందని సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారని తెలిసింది. అయితే జగన్ వెంటనే తడుముకోకుండా నమ్మకద్రోహం చేసిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకునే ప్రశ్నే లేదని, వారి స్థానంలో కొత్త వారిని ఎంపిక చేసి వారిని గెలిపించుకునే ప్రయత్నం చేద్దామని అన్నట్లు తెలిసింది. అలా పార్టీలో చేర్చుకుంటే క్యాడర్ తో పాటు ప్రజల్లోనూ తప్పుడు సంకేతాలు వెళతాయని, అందుకే అటువంటి ప్రతిపాదనలు ఎవరు తెచ్చినప్పటికీ తన వద్దకు మాత్రం తేవద్దని జగన్ ఖరాఖండిగా చెప్పినట్లు వైసీపీలో టాక్ వినిపిస్తుంది. అంటే ఇటీవల కాలంలో పార్టీని వీడి వెళ్లిపోయిన నేతలకు ఇక నో ఎంట్రీ అని జగన్ చెప్పినట్లు తెలిసింది. ఎంతటి వారైనా, చివరకు బంధువులకు కూడా నో ఛాన్స్ అంటూ ఆయన క్లారిటీని నేతలకు ఇచ్చినట్లు తెలిసింది. తనతో కష్టంలో ఉన్న వాళ్లతోనే తన ప్రయాణం ఉంటుందని, భయపడి వెన్నుచూపి పారిపోయే వాళ్లతో పొలిటికల్ జర్నీ తాను చేయలేనని కూడా జగన్ తెగేసి చెప్పినట్లు అంటున్నారు. ఎవరైనా వెళతామన్నా తనకు అభ్యంతరం లేదని, తనకు అధికారం ముఖ్యం కాదని, తాను మరో ఇరవై ఐదేళ్ల పాటు రాజకీయాలు చేస్తానన్న నమ్మకం ఉందని, తనతో నమ్మకంగా ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుందని కూడా జగన్ సీనియర్ నేతల ముందు కుండబద్దలు కొట్టినట్లు తెలిసింది. దీంతో వెళ్లిన వారికి గేట్లు క్లోజ్ అయినట్లేనని పార్టీ నుంచి అందుతున్న సమాచారం

## కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**కడప :** కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ, కారు ఢీకొన్న ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. రాయచోటి నుంచి కడపకు కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గువ్వలచెరువు ఘాట్ రోడ్డు వద్దకు కారు రాగానే వెనుక వైపు నుంచి లారీ అతివేగంగా ఢీకొంది. ఆ వేగానికి లారీ కారుపై పడడంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. కారుపై పడ్డ లారీని తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇంకా వాహనంలో ఎవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు..

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు ప్రజంటేషన్‌కు సమావేశంలో పెద్ద ఎత్తున ప్రశంసలు దక్కాయి. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తన ప్రజంటేషన్‌లో చంద్రబాబు వివరించారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ఏపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు వెల్లడించారు. వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులను తాము ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనే విషయాన్ని తన ప్రజంటేషన్‌లో వివరించారు. అంత ర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖను తీర్చిదిద్దనున్నట్లు సీఎం వెల్లడించారు. విశాఖకు గ్లోబల్ హంగులు అద్దేలా నాలుగు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొం దిస్తున్నట్టు వివరించారు. విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్ వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్టు స్పష్టం చేశారు.

## ఇక సీఎంవో ప్రక్షాళన

-మొదటిపేజీ తరువాయి

అధికారికి హిందీపై పెద్దగా పట్టు లేకపోవడం మైనస్‌గా మారింది. దీంతో యువ అధికారితో ఆయనకు దోస్తీ కుదిరింది.ప్రస్తుతం ఒకరికొకరు అండగా ఉన్న ఇద్దరు అధికారులకు మొదట్లో పొసిగేది కాదని ఆ తర్వాత పరిస్థితుల ప్రభావంతో ఇద్దరు కలిసి పోయినట్టు తెలుస్తోంది.సీఎంఓలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ అధికారి వ్యవహార శైలిపై అధికార పార్టీ నేతల్లో మొదటి నుంచి తీవ్ర అసంతృప్తి ఉంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా తమ నాయకుడికి ఆయన తీరుపై పలుమార్లు ఫిర్యాదులు చేశారు.ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్నకీలకమైన మంత్రి తరపున వచ్చే ఆదేశాలను, సూచనలు ఆ అధికారి మొదట్లో ఖాతరు చేసేవారు కాదు. ఈ పరిణామంపై ఆ నాయకుడు అసంతృప్తిగా ఉన్నట్టు తెలియడంతో కొద్ది నెలలుగా ఆయన్ని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోందిమరోవైపు సీఎంఓలో కొందరు అధికారులు తమను పట్టించుకోవడం లేదని అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం ఫిర్యాదులు చేయడంతో ప్రభుత్వం పునరాలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. విషయం తెలియడంతో మంత్రితో సన్నిహితంగా ఉండే అధికారి మధ్యవర్తిత్వంతో యువ నాయకుడికి వివరణ ఇచ్చుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించే విషయంలో అంతిమ నిర్ణయం ముఖ్యమంత్రిదే కావడంతో ఇప్పుడు బదిలీలపై ఉత్కంఠ నెలకొంది.ప్రభుత్వం మారిన వెంటనే వైసీపీ ప్రభుత్వ హయంలో తనను వేధింపులకు గురి చేశారని, పోస్టింగ్ కూడా ఇవ్వకుండా వేధించారని ఓ అధికారి ప్రభుత్వ పెద్దలకు చెప్పుకున్నారు. దీంతో ఆయనకు ముఖ్యమైన స్థానంలో పోస్టింగ్ లభించింది. ఇప్పుడు బదిలీ ప్రచారం జరుగుతుండటంతో మళ్లీ దానిని తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోందివైసీపీ ప్రభుత్వంలో బాధిత అధికారిగా ఆయనకు సానుభూతి లభించింది. ప్రస్తుతం అధికారుల బదిలీ, స్థానచలనాలు తప్పవని తెలియడంతో మళ్లీ వైసీపీ బాధితులమనే అస్త్రాన్ని తెరపైకి తెచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. వైసీపీ హయంలో పోస్టింగ్ దక్కక పోవడానికి అనుమతి లేకుండా అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్ళడంతో జగన్ ప్రభుత్వంలో సీఎంఓ ఆయన స్థానంలో మరొకరిని నియమించారని, దానికే ఆయన పొలిటికల్ కలరింగ్ ఇచ్చారని చెబుతున్నారు. ఐఏఎస్‌లకు వృత్తిపరమైన శిక్షణలో భాగంగా సెలవులు మంజూరు చేస్తే దానిని పొడిగించడంతో మరొకరికి ఆ బాధ్యతలు ఇచ్చారని సచివాలయ వర్గాలు గుర్తు చేస్తున్నాయిప్రస్తుతం ఏపీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకురాగలిగిన అధికారుల అవసరం తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవగాహన ఉన్న వారికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ఢిల్లీ స్థాయిలో పనులు చక్కబెట్టే అధికారులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.ప్రస్తుతం ఆర్థిక శాఖకు సారథ్యం వహిస్తున్న పీయూష్ కుమార్‌కు మరో ఏడాదిన్నరలో ఆయన కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా పదోన్నతి లభించే అవకాశం ఉంది. ఆయన ఎక్కువ కాలం రాష్ట్ర సర్వీసుల్లో కొనసాగే అవకాశాలు లేవు. నేర్పు ఉన్న అధికారుల కొరత తీవ్రంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.ప్రధానంగా ఢిల్లీలో పనులు జరగాలంటే ఉత్తరాది అధికారులకు పనులు జరిగినంత సులువుగా తెలుగు అధికారుల హవా నడవదని ప్రధానంగా భాష సమస్యను అధిగమించి ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ శాఖల కార్యదర్శుల్ని మెప్పించగలిగిన అధికారుల లోటు ఉందని ఐఏఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఢిల్లీలో పనులు చక్కబెట్టగలిగి, రాష్ట్రానికి కావాల్సిన నిధుల్ని తెప్పించడంలో ఏపీ క్యాడర్ అధికారులు వెనుకబడుతున్నారనే ప్రచారం కూడా ఉంది. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన అధికారికి, మరో అధికారి సంప్రదింపుల విషయంలో, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడంలో సాయం చేస్తున్నా అవి పెద్దగా వర్కౌట్ కావడం లేదని తెలుస్తోంది. కీలకమైన పోస్టింగ్‌లో ఉన్న మరో యువ అధికారి పనితీరుపై కూడా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏడాది కాలంలో ముఖ్యమైన బాధ్యతల్లో ఉన్నా ఆయన ప్రభావాన్ని చూపలేకపోయారని చెబుతున్నారు.పోస్టింగ్ విషయంలో ప్రభుత్వ అధినేతను ప్రసన్నం చేసుకున్న వారికే ప్రాధాన్యత లభిస్తుండటంతో త్వరలో జరిగే ప్రక్షాళనలో తమ స్థానాలను పదిలం చేసుకోవాలని ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం సీఎంఓలో ఉన్న అధికారుల్లో ఒక్కరిద్దరిని మాత్రమే ఖచ్చితంగా కొనసాగిస్తారని మిగిలిన వారి స్థానాల్లో మార్పు తప్పదని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల కొందరి పనితీరుపై పత్రికల్లో పతాక స్థాయిలో కథనాలు రావడంతో ఐఏఎస్ బదిలీల్లో ఏమి జరుగనుందనే ఆసక్తి నెలకొంది.

## గత ప్రభుత్వం ఛీత్కారాలను మర్చిపోయారా..

తెలుగు చిత్ర పరిశ్రమపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయం సంచలన ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా.. తెలుగు సినిమా సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారా అని పవన్ పేషీ ప్రశ్నించింది. గత ప్రభుత్వం సినిమా రంగంవారిని, అగ్ర నటులను ఛీత్కరించిన తీరును గుర్తు చేసింది. ఇకపై ప్రభుత్వంతో వ్యక్తిగత చర్చలు ఉండవని, సినిమా సంఘాల ప్రతినిధులే రావాలని స్పష్టం చేసింది. ఇంకా ఆ ప్రకటనలో ఏముందంటే.. కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు.. సినిమా రంగం అభివృద్ధినే చూస్తుంది. ఏపీలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని.. ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే.. తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు. ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారి కూడా మర్యాదపూర్వకంగా కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం సంఘటితంగా రాలేదు. అందరూ కలసి రావాలి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించినా సానుకూలంగా స్పందించలేదు. తెలుగు సినిమా రంగంలోని అగ్ర నటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఛీత్కరించి.. ఇక్కట్ల పాలు చేసిందో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్స్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరిచిపోయినట్లున్నాయి. రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు, సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకూడదు. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. కక్ష సాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో తహసీల్దార్లను థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులుపెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా? ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు.

# సంపాదకీయం

## నాలుగేళ్ల ‘అగ్నిపథ్’ ఎవరి కోసం?

భారత్‌కు ఏడు పొరుగు దేశాలతో భూ, సముద్ర సరిహద్దులున్నాయి. ఇవి వరుసగా 14,868 కిమీ, 7,000 కిమీ (మొత్తం 21,868 కిమీ). ఒక్క బంగ్లాదేశ్‌తోనే 4,026 కిమీ భూ సరిహద్దు ఉంది. వీటిలో చాలా వరకు కంచె గాని, బి.ఎస్.ఎఫ్ పహారా గాని లేదు. ఇక, పాకిస్తాన్‌తో 3,323 కిమీ సరిహద్దు ఉంది. భారత్‌కు పొరుగు దేశాలతో సత్సంబంధాలనేవి గతానికి సంబంధించినవి. సోవియట్ రష్యా పతనం తర్వాత, యుద్ధ పరిస్థితిలో భారత్‌కు ప్రత్యక్షంగా అండగా నిలిచే దేశం ప్రపంచంలో మరేదీ లేదు. పైగా దేశంలో సైన్యం వినియోగం పెరుగుతోంది! అంతే కాదు. త్రివిధ దళాలు ఒకేసారి యుద్ధంలో పాల్గొనడం అసాధ్యం. ఈ పరిస్థితుల్లో, సైన్యాన్ని బలహీనపరిచే ఒక ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టడం చాలా ప్రమాదకరం. ఈ చర్యను ఖండించాలి కూడా. భారత ఆర్మీ 12 లక్షల మంది సైనికులతో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద సైనిక దళం. ప్రతి సంవత్సరం 55,000 మంది సైనిక సిబ్బంది పదవీ విరమణ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సగటున 60,000 మంది సైన్యంలోకి నియమితులవుతున్నారు. దేశంలోనే అతి పెద్ద ఉద్యోగ సంస్థ సైన్యం. భారత సైనికుల శారీరక, మానసిక బలం, వృత్తి నైపుణ్యాలు, క్రమశిక్షణ, సామర్థ్యం, దేశభక్తి, త్యాగాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి. దీనికి కారణం అధిక-నాణ్యత, దీర్ఘకాలిక సైనిక శిక్షణా పద్ధతులు. ఆర్మీలోని ఒక్కో సైనికుడు ఏడు సంవత్సరాల పాటు అత్యంత కఠినమైన శిక్షణ పొందుతాడు. శిక్షణలో విజయం సాధించిన వారిని యుద్ధ భూమిలో సైనికులకు సహాయకులుగా నియమిస్తారు. అక్కడ అవసరమైన అనుభవాన్ని గడించడానికి సైనికులను సహాయకులుగా నియమిస్తారు. అప్పుడు వారు నేరుగా యుద్ధంలో పాల్గొనవచ్చు. సైనికులకు ఇటువంటి సుదీర్ఘ శిక్షణ ఇవ్వడమనేది చాలా సాధారణమైన విషయం. 15 సంవత్సరాలపాటు సైన్యంలో సేవ చేసిన ఒక సైనికుడు ఉద్యోగ విరమణ చేసినప్పుడు 7 సంవత్సరాల శిక్షణతో కూడిన 15 సంవత్సరాల పని అనుభవమున్న సైనికుడిని ఆర్మీ కోల్పోతుంది. కఠోరమైన వ్యాయామం, క్రమశిక్షణ, సమతుల ఆహారం, అనుకూలమైన పని వాతావరణం, ఐక్యతా భావం, దేశం కోసం పని చేయాలనే మక్కువ వంటివన్నీ పౌర సమాజంలోని తోటివారితో పోలిస్తే రిటైర్మెంట్ సమయంలో ఆర్మీ జవాన్ శారీరక, మానసిక ఆరోగ్యంతో చురుకుగా వుంటాడు. 32 నుంచి 36 ఏళ్ల మధ్య సైనిక సిబ్బంది ఉద్యోగ విరమణ చేయాలనే నియమాన్ని దేశ తొలి రక్షణ దళాధిపతి, దివంగత బిపిన్ రావత్ వ్యతిరేకించారు. వీరిలా నైపుణ్యం, క్రమశిక్షణ కలిగిన మానవ వనరులను మరో 15 సంవత్సరాలు ఉపయోగించడం ఆర్మీకి ఎంతో ప్రయోజనకరమని ఆయన విశ్వసించారు. 62 సంవత్సరాల వయస్సులో ఉన్న ఒక సైనిక అధికారి ఆశించిన సామర్థ్యం, నాణ్యత, వేగంతో సేవలను అందించగలిగినప్పుడు 32-36 సంవత్సరాల మధ్య వయస్సుగల జవాన్ ఏ కారణం చేత ఆవిధంగా పనిచేయలేడనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. సైనిక సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు పెంచాలని ఆయన ప్రభుత్వానికి లిఖితపూర్వక ప్రతిపాదనను సమర్పించారు. అయితే, సైనికుల రిటైర్మెంట్ వయస్సు, సైన్యం సగటు వయస్సు ఎంత ఉండాలనే దానిపై సైన్యంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. యుద్ధం ప్రజలకు హాని కలిగిస్తుంది. ఈ ప్రపంచం యుద్ధం నుండి విముక్తి పొందితే మంచిది. ప్రపంచంలో యుద్ధానికి, సైన్యానికి ఖర్చు చేసే భారీ మొత్తాన్ని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించినట్లయితే ప్రపంచ ముఖచిత్రమే మారిపోతుంది. కానీ దాడి, దురాక్రమణ, యుద్ధం నిజమైనప్పుడు, దేశ ప్రయోజనాల కోసం సైన్యానికి డబ్బు కేటాయించేందుకు ఏ దేశమూ ఏమాత్రం వెనుకాడదు. సైన్యం సగటు వయస్సు తగ్గింపును, సైన్యం మీద చేసే ఖర్చు తగ్గింపును కారణంగా చూపించిన మోడీ ప్రభుత్వం 2022 నుండి ‘లెఫ్టినెంట్’ స్థాయి కంటే దిగువన ఉన్న అన్ని శాశ్వత పోస్టులకూ నియామకాలను నిలిపివేసింది. ‘అగ్నిపథ్’ ద్వారా మాత్రమే సైనిక నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది. వాస్తవం ఏమిటంటే%ొ%సైన్యానికి, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ అగ్నిపథ్ ప్రాజెక్టును ఉపసంహరించు కోవాలని, సైన్యంలో భారీ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి%ొ%వామపక్షాలు మినహా ఏ బిజెపి యేతర పార్టీ కూడా చొరవ తీసుకోలేదు. 17 నుండి 21 సంవత్సరాల మధ్య వయస్సుగల యువకులను ‘అగ్నివీర్ ప్రాజెక్ట్’ కింద 4 సంవత్సరాల పాటు సైన్యంలో నియమించుకుంటారు. ఏటా 46,000 మంది అగ్నివీర్ సిబ్బందిని నియమిస్తారు. వీరిలో 75 శాతం మంది (34,500) 4 సంవత్సరాల తర్వాత 25 సంవత్సరాల వయస్సులో రిటైర్ అవుతారు. మిగిలిన 25 శాతం మంది (11,500) 4 సంవత్సరాల తర్వాత శాశ్వత సైనిక సిబ్బందిగా నియమితులవుతారు. ఇతర శాశ్వత నియామకాలేవీ ఉండవు. 2019 జనవరి 1 నాటికి, సైన్యంలో 1,04,653 ఖాళీలు ఉన్నాయి. 2019 నుండి 2023 వరకు నాలుగు సంవత్సరాలలో శాశ్వత నియామకాలు జరగలేదు. 2025 వరకు శాశ్వత నియామకాలు ఉండవు. సంవత్సరానికి సగటున 55,000 ఉద్యోగ విరమణలతో 2026 జనవరి 1 నాటికి సైన్యంలో (1,04,653 ం 55,000  7) 4,89,653 ఖాళీలు ఉంటాయి. 12 లక్షల మంది సైనికుల స్థానంలో 7 లక్షల మంది సైనికులు ఎంత పని చేయగలరు? అత్యవసర సమయాల్లో సైన్యానికి సహాయం చేయగల సెంట్రల్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్‌లో 2022 జనవరి1 నాటికి 2,50,000 ఖాళీలు ఉన్నాయి. సైన్యంలో ఇంత పెద్ద సంఖ్యలో ఖాళీలున్న సమయంలో ఒకవేళ యుద్ధాన్ని ఎదుర్కోవాల్సి వస్తే! పౌర రక్షణ మాటేమిటి? దేశం ఇబ్బందుల్లో పడుతుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.  2026 నుండి ఏటా 11,500 మంది అగ్నివీర్‌లను శాశ్వత స్థానాలకు నియమిస్తారు. చాలా పెద్ద సంఖ్యలో సైనికులు ఉద్యోగ విరమణ చేస్తారు. కాబట్టి 2026 నుండి, ఈ 7 లక్షలుగా వున్న సైన్యం సంఖ్య ప్రతి సంవత్సరం తగ్గుతూనే ఉంటుంది. మూడవది-నాలుగు సంవత్సరాల అగ్నివీర్ లను 6 నెలల నామ్ కే వాస్తే శిక్షణ తర్వాత నేరుగా యుద్ధానికి పంపుతారు. ఏడేళ్ల శిక్షణ తర్వాత సైన్యానికి సహాయకులుగా వెళ్లడానికి కేవలం ఆరు మాసాల శిక్షణతో సైనికులకు సహాయకులుగా పంపడానికి ఎంత వ్యత్యాసం వుంటుంది? ఇది ప్రత్యామ్నాయం అవుతుందా? యుద్ధం జరిగే అవకాశం ఉన్న దేశాలు తమ దళాల సంఖ్యను పెంచడంతో పాటు శిక్షణా వ్యవధిని, నాణ్యతను నిరంతరం మెరుగు పరుస్తున్నాయి. యుద్ధ భూమిలో సైనిక శిక్షణ పొందిన శత్రు సైనికులతో పోటీ పడటానికి 6 నెలల శిక్షణతో నాలుగేళ్ల కాంట్రాక్ట్ సైనికులు ఏ మంత్రదండాన్ని ఉపయోగిస్తారు? 2026 నుండి ఏటా 60,000 మందికి బదులుగా 11,500 మంది అగ్నిమాపక సిబ్బందిని శాశ్వత స్థానాలకు నియమిస్తారు. అంటే ఏటా 48,500 శాశ్వత నియామకాలకు అవకాశం తగ్గిపోతుంది. దేశ జనాభాలో 50 శాతం 24 ఏళ్ల లోపువారు. 65 శాతం మంది 35 ఏళ్ల లోపువారు. జనాభా సగటు వయస్సు 27.5 సంవత్సరాలు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి చూసినట్లయితే ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం అత్యధిక స్థాయిలో ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉపాధి దాదాపు సున్నా. ప్రభుత్వం సంవత్సరానికి ఉద్యోగ అవకాశాల సంఖ్యను 45,500కు తగ్గించడం ద్వారా నిరుద్యోగుల సంఖ్యను పెంచింది. ఇది ఉద్యోగార్థులను నిరాశపరిచింది. నాలుగేళ్ల తర్వాత రిటైర్ అయిన అగ్నివీర్ లకు ఎటువంటి పెన్షన్ లభించదు. 4 సంవత్సరాల సర్వీస్ సమయంలో తమ నెలవారీ జీతం నుండి 30 శాతం చొప్పున పక్కన పెట్టిన రూ.5,04,000 (వడ్డీని మినహాయించి), ప్రభుత్వం నుండి రూ.6,67,000 పొందుతారు. నాలుగేళ్ల సర్వీస్ తర్వాత, 21-25 సంవత్సరాల మధ్య వయస్కులైన అగ్నివీర్‌లు ప్రతి సంవత్సరం 37,500 మంది తమ ఉద్యోగాలను కోల్పోయి మళ్ళీ ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తారు. 25 సంవత్సరాల వయస్సులో ఉద్యోగం చేస్తూ మళ్ళీ నిరుద్యోగిగా మారడం, నెలవారీ ఆదాయం పూర్తిగా ఆగిపోవడం ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి వున్న సమస్యలు. ఈ 4 సంవత్సరాలు వారికి చదువుకోవడానికి లేదా మరో ఉద్యోగానికి సిద్ధం కావడానికి అవకాశం ఉండదు. కాబట్టి ఈ అగ్నిపథ్ సిబ్బంది అత్యంత పోటీ వాతావరణం వున్న ఉపాధి మార్కెట్‌లో కొత్త ఉద్యోగాలను పొందలేరని భావించవచ్చు. వాస్తవానికి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉద్యోగ విరమణ చేసిన సైనిక సిబ్బందికి కేటాయించిన 92-95 శాతం స్థానాలు ఎల్లప్పుడూ ఖాళీగా ఉంటాయి. భర్తీ చేయబడవు. ప్రభుత్వం సైన్యం కోసం రిజర్వు చేసిన ఉద్యోగాలను తగ్గించాలన్న ‘వ్యూహా’న్ని వేసినప్పుడు అగ్నివీర్ అనే ఈ నాలుగేళ్ల కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగ విరమణ తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో నియమించడం చాలా కష్టం. ఈ విషయాన్ని పక్కన పెడితే, రిటైర్ అయిన వారికి ఆర్మీ ప్రదానం చేసే బ్యాచిలర్ డిగ్రీలను ఏ ప్రభుత్వమూ గుర్తించదు.

# పొగాకు రైతుల సాగుగాథలు



బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలెంలో కౌలు రైతు ఆత్మహత్య! ముప్పాళ్ళ మండలంలో కౌలు రైతు ఆత్మహత్య! ఇంకొల్లు మండలంలో కౌలు రైతు ఆత్మహత్యాయత్నం! ఎందుకిలా జరుగుతున్నది? సుమారు 90 నుండి 150 రోజులు కష్టపడి ఆటుపోట్లను తట్టుకొని పొగాకు పంట సాగు చేశారు. పంట వేయక ముందు వివిధ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో రైతాంగం చుట్టూ తిరిగి ‘నల్ల బర్లీ వేయండి. గత సంవత్సరం రేటు ఇంకా రెండు మూడు సంవత్సరాలు ఉంటుంది’ అని ప్రోత్సహించారు. ఫలితంగా పొగాకుతో పాటు ఇతర పంటలు వేసే రైతులు అన్నీ వదులుకొని నల్ల బర్లీ పొగాకు ఒక్కటే సాగు చేశారు. గత సంవత్సరం రేటు సంగతి పైవాడికెరుక. ఇప్పుడు ఎంతో కొంతకు కొనే నాథుడు కూడా లేడు. పైగా సంవత్సరం అంతా ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు, ఎరువులు, పురుగు మందుల షాపుల నుంచి అరువు తెచ్చిన రైతులు, కౌలు రైతులు చివరకు కూలీలకు డబ్బులు ఇవ్వలేకపోతున్నారు. భార్య మెడలో బంగారాన్ని తాకట్టు పెట్టినా సరిపోక అప్పుల వారికి మొహం చూపించలేకపోతున్నారు. కనీసం అడుగు ఆకు అమ్మయినా కూలి డబ్బులు తీరుద్దామంటే అది కూడా దారుణంగా ఉంది. అడుగు ఆకు కోస్తే క్వింటాకి రూ.5000 కూలి అయింది. ఆ అడుగు ఆకుని కంపెనీకి అమ్ముకుంటే కేవలం రూ.2500 వచ్చిందంటే పంట పండించడానికి అయిన ఖర్చు, కూలి కలిపి రాకపోయినా.. కూలీలకైన ఖర్చన్నా రాకపోగా అందులో సగం డబ్బు మాత్రమే వచ్చింది. వీటన్నింటి వలన ప్రత్యేకించి కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. నేడు రైతులు కేజీ పొగాకును 30 రూపాయల నుండి 100 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. ఆ కేజీ పొగాకుతో కనీసం 1250 నుండి 2000 సిగరెట్ల వరకూ తయారవుతాయి. అంటే ఒక్కొక్క సిగరెట్టుకు 0.7 గ్రాముల నుండి ఒక గ్రాము వరకు పొగాకు వాడతారు. ఈ క్రమంలో కొంత వృధా అయినా తక్కువలో తక్కువగా సగటున 1250 సిగరెట్లు వస్తాయి. ఒక్కొక్క సిగరెట్టు సగటు ధర రూ.10 అనుకున్నా కేజీ పొగాకు ద్వారా ఉత్పత్తి అయిన 1250 సిగరెట్లను అమ్ముకుంటే కంపెనీకి రూ.12,500 వస్తాయి. రైతులకు పొగాకు కోసం రూ.30 నుండి రూ.100 పోతాయి. అంటే ఒక కేజీ పొగాకు ద్వారా రూ.12,400 ఆదాయం కంపెనీకి వస్తుంది. ఒక ఎకరాకు 12 నుండి 13 క్వింటాళ్ళు పొగాకు పండిస్తున్నారు. అంటే క్వింటా రూ.10,000 చొప్పున 12 క్వింటాళ్లు కొన్నారనుకుంటే రైతులకు రూ.1,20,000 వస్తున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష 50 వేలు అయ్యింది. దాంతో రైతుకు ప్రతి ఎకరాకు రూ.30 వేల నుండి రూ.50 వేలు నష్టం వస్తుంది. అదే కంపెనీకి కేజీ పొగాకుతో చేసిన 1250 సిగరెట్లు అమ్ముకోవడం ద్వారా రూ.12,400 వస్తుంది. ఎకరా పొగాకు ద్వారా కంపెనీకి రూ.12 లక్షల 40 వేల ఆదాయం వస్తుంది. ఈ అంకెలు కొంచెం నమ్మడానికి కష్టంగా ఉంటుంది. కానీ ఐటిసి కంపెనీ అనేక వ్యాపారాలు చేస్తుంది. ఇంటర్నెట్‌లో లభించిన సమాచారం మేరకు 2024 సంవత్సరంలో కంపెనీ రూ.20 వేల 751 కోట్ల నికర లాభం పొందింది. ఆ కంపెనీకి రూ.91,826 కోట్ల విలువ గలిగిన స్థిరాస్తులున్నాయి. ఐటిసి కంపెనీ సీఈఓ జీతం నెలకు రూ.రెండు కోట్ల పైనే. అంటే గంటకు రూ.10 లక్షలు జీతం. మన రైతు సంవత్సరం అంతా ఎండనకా వాననకా ఆరుగాలం కష్టపడి పనిచేసినా ఆయన గంట జీతం అంత కూడా సంపాదించలేకపోతున్నాడు.

క్యాడ్బరీ పరిస్థితి కూడా అలాగే వుంది. నేడు అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలు కేజీ రూ.800 నుంచి రూ.900 రూపాయలు తక్కువ కాకుండా కొంటున్నారు. కానీ మన రాష్ట్రంలో మాండలిస్ కంపెనీ ఈ కోకో గింజలను కేవలం 450 రూపాయలకే కొంటున్నది. ఒక కేజీ కోకో గింజల నుంచి 800 గ్రాముల కోకో నిబ్స్ వస్తాయి. 400 నుండి 500 గ్రాముల కోకో లిక్విడ్ వస్తుంది. వంద గ్రాముల కోకో చాక్లెట్‌లో 70 గ్రాముల కోకో పదార్థాలుంటాయి. వంద గ్రాములు కోకో లిక్విడ్‌తో పది చాక్లెట్లు వస్తాయి. అలాగే మిల్క్ షేక్ అయితే 12 నుంచి 16 ముక్కలు వస్తాయి. చాక్లెట్లు ఒక కేజీకి సుమారుగా 150 ముక్కలు వస్తాయి. అంటే తక్కువలో తక్కువ కంపెనీకి రూ.16 వేలు వస్తాయి. కానీ రైతుకి ఇస్తున్నది కేజీకి రూ.450 మాత్రమే. అంటే రైతుకిచ్చిన దానికి అదనంగా 40 రెట్లు లాభం కంపెనీకి వస్తుంది. మాండలిస్ కంపెనీ 2022-2023లో రూ.1176 కోట్ల నికర లాభం పొందగా, 2023-2024లో రూ.2020 కోట్ల నికర లాభాలు సంపాదించింది. ఆ కంపెనీ కూడా రూ.5.76 లక్షల కోట్ల విలువ కలిగిన ఆస్తులున్నాయి. ఈ కంపెనీ షేర్ విలువ కూడా 64.14 డాలర్లకు పెరిగింది. ఈ మధ్య కాలంలో చాక్లెట్ల ధర 22 శాతం నుండి 30 శాతం వరకు పెంచారు. క్యాడ్బరీ కంపెనీ ఎమ్.డి స్థాయి అధికారుల జీతాలు నెలకు రూ.64 లక్షల నుండి రూ.96 లక్షల మధ్యలో ఉన్నాయి. అలాగే ఇతర ఉన్నతాధికారులు జీతాలు కూడా లక్షల్లో ఉన్నాయి. కానీ ఈ కంపెనీల లాభాలకు, స్థిరాస్తులకు, ఉన్నతాధికారుల జీతాలకు ముడి పదార్థమే మూలం. ఆ ముడి పదార్థం లేకపోతే కంపెనీ లేదు. లాభాలు లేవు. ఆస్తులు కూడా ఉండవు. కానీ ఆ ముడి పదార్థం పండించే రైతులు, కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. వున్న కొద్దో గొప్పో ఆస్తులను కూడా అమ్ముకుంటున్నారు. చివరకు ఆత్మాభిమానంతో అప్పుల వారికి మొహం చూపించలేక అప్పులు తలుచుకుంటూ ఆప్తులను, భార్యాబిడ్డలను కూడా వదులుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు. కంపెనీలు లాభాలతో కోట్లకు పడగలెత్తుతుంటే, పొగాకు సాగు చేసిన కౌలు రైతులు చివరకు ఆత్మహత్య చేసుకుని పాడెక్కుతున్నారు. డబ్బు కంటే విలువైనది ప్రాణం. ఆ విలువైన ప్రాణాన్ని రైతాంగం బలవంతంగా తీసుకుంటున్నారంటే ప్రభుత్వం, ప్రజలు, సభ్యసమాజం ఆలోచించాలి. మీటింగ్‌కి వెళ్తున్నారా అని వెటకారంగా పలకరించటం, మంత్రిగారి దగ్గరికి వెళుతున్నారా, కొనుగోలు ఇంకా ఆలస్యం అవుతుందని హెచ్చరించడం, ధర్నా చేస్తున్నారా ధర ఇంకా పడిపోతుందని బ్లాక్ మెయిల్ చేయడం. ఇదీ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో చేసే ప్రచారం. వాస్తవంగా పొగాకు వేయమని ప్రజల్లో ప్రచారం చేసి, నమ్మించి మోసం చేసినందుకు ఈ కంపెనీ ప్రతినిధుల మీద ఐపిసి సెక్షన్ 426 కేసు పెట్టాలి. ఇప్పటికీ వ్యవసాయ శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి సమక్షంలో కంపెనీల ప్రతినిధులు పలు దఫాలు చర్చించారు. అయినా కొనుగోలు వేగవంతం కాలేదు. మంత్రులు చర్చల తర్వాత కూడా కంపెనీలు కొనుగోళ్లు చేయటం లేదు. అంటే ప్రభుత్వ పాత్రని అనుమానించాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో... పొగాకు సాగుదారులందరూ ఐక్యంగా పోరాడితేనే పంటకు గత సంవత్సరం ధర సాధించగలుగుతారు.

# వైపరీత్యాల పట్ల అవగాహన ఏదీ

ప్రపంచ వ్యాప్తంగా అనేకానేక దేశాల్లో ప్రకృతి విపత్తులు విరుచుకు పడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న విధ్వంసంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఈ సందర్భంగా ప్రకృతి వైపరీత్యాల గురించి అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరం. సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత ఆకస్మిక సంఘటనలే విపత్తులు. విపత్తు అనే పదాన్ని ఇంగ్లిష్‌లో “డిజాస్టర్” అంటారు. ఇది మధ్యయుగం నాటి ఫ్రెంచి పదం. దీన్ని మూడు భాషా పదజాలల నుంచి గ్రహించారు. అవి.. 1) డస్ (ఐబం), ఆస్టర్ (ూర్‌వతీ) అనే గ్రీకు పదాలు. 2) డెస్ (ఐవం), ఆస్ట్రే (ూర్‌తీవ) అనే ఫ్రెంచ్ పదాలు. 3) డిస్ (ఐఅం), ఆస్ట్రో (ూర్‌తీశీ) అనే లాటిన్ పదాలు గ్రీకు, లాటిన్ భాషల్లో డిజాస్టర్ అంటే ‘దుష్ట నక్షత్రం’ అని అర్థం. అలానే విపత్తు అనే పదాన్ని ఇంగ్లీషులో డిసాస్టర్ అంటారు. విపత్తు ఒక భయంకర పరిస్థితి. దీంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తం అవుతుంది. పర్యావరణ స్థితి విచ్ఛిన్నం అవుతుంది. భూమి కంపించడం వలన జరిగే వైపరీత్యాలు, జల వైపరీత్యాలు, వడగాలి, అగ్ని, మహమ్మారులు, అంతరిక్షం ప్రభావాల సంఘటనలు , సౌర జ్వాలలు తదితరాల ప్రభావం మానవ జీవితంపై  అధికంగా ఉంది. విపత్తుల వల్ల 1) వరదలు - 30 శాతంబీ 2) తుపానులు - 21 శాతంబీ 3) కరవు- 19 శాతంబీ 4) మహమ్మారి వ్యాధులు - 15 శాతంబీ 5) భూకంపాలు, సునామీలు - 8 శాతంబీ 6) భూతాపాలు - 4 శాతం 7) హిమపాతాలు - 11 శాతంబీ 8) అగ్ని పర్వతాలు - 1 శాతంబీ 9) కీటక దాడులు - 1 శాతంబీ నష్టాలు సంభవిస్తున్నాయి. డిజాస్టర్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఐడీకేఎన్) రిపోర్టుల ప్రకారం దేశంలోని 29 రాష్ట్రాలు ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏదో ఒక విపత్తుకు తరచు గురవు తున్నాయి. దేశంలోని తీర ప్రాంతాలు విశిష్టమైన ప్రకృతి వనరులు, జీవ వైవిధ్యానికి ప్రతీకలు. దేశ ఆర్థిక పరిపుష్టి లో విశేషమైన పాత్ర ఇవి పోషిస్తున్నాయి. 13 రాష్ట్రాల్లోని 84 జిల్లాలు, అండమాన్, లక్షద్వీప్ కేంద్రపాలిత రాష్ట్రాల్లో 7,500 కిలోమీటర్లలో సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. వీటిల్లో గుజరాత్ (1,214 కి.మీ.) ఆంధ్రప్రదేశ్‌లో (7 కి.మీ.) రాష్ట్రాల్లో అధికంగా తీరప్రాంతం ఉంది. అడవులు, చిత్తడి నేలలు, పగడపు దిబ్బలు, ఉప్పునీటి కయ్యలు, ఇసుక నేలలు వంటి జీవ వైవిధ్యం తీరప్రాంతాల్లో ఉంటాయి. తీరంలోని యాభై కిలోమీటర్ల లోపు రమారమి ముప్పై కోట్ల మేర జనాభా నివసిస్తుంది. పర్యావరణ సమ తుల్యత లోపించడం



వాతావరణంలో పెనుమార్పులు విపత్తులకు మూలకారణం పెరుగుతున్న జనాభా, నగరీకరణ, తీర నియంత్రణ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలు, పరిశ్రమలు, ఓడరేవుల విస్తరణ తీరంలోని జీవ వైవిధ్యానికి చేటు తెస్తూ సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం.. భారత దేశంలో సంభవించే విపత్తుల వల్ల జాతీయ ఆదాయంలో ఏటా 2.25 శాతం నష్టం వాటిల్లుతోంది. ‘ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్’ రిపోర్ట్ ప్రకారం భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. వీటి ద్వారా సుమారు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీటి ప్రభావానికి గురయ్యారు. సుమారు 4,800 కోట్ల అమెరికన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. ఇవి ఇప్పటి వరకు భారత దేశంలో, ప్రపంచంలోనూ ఎక్కువసార్లు సంభవించిన విపత్తు ‘వరదలు’గా ఆ నివేదిక పేర్కొంది. ప్రకృతి విపత్తులకు భారత్ అంతులేని మూల్యాన్ని చెల్లిస్తోందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక కుండ బద్దలు కొట్టింది. 20 ఏళ్లలో విపత్తుల కారణంగా దేశం 7,950 కోట్ల డాలర్లు (సుమారు రూ.5.91 లక్షల కోట్లు) నష్టపోయింది. ఆర్థిక నష్టాలు, పేదరికం, విపత్తుల పేరిట 2017 ఆగస్టులో విడుదలైన నివేదికలో వివిధ, దేశాలు నష్టపోయిన మొత్తం విలువ 2.9 లక్షల కోట్ల డాలర్లుగా తేలింది. అంతకుముందు 20 ఏళ్ల వ్యవధి నష్టాల కంటే ఇది రెట్టింపు. ప్రపంచంలో విపత్తుల వల్ల నష్ట పోతున్న వారి సంఖ్య 211 మిలియన్లు. విపత్తుల వల్ల భారత్ లో ఏటా 10 బిలియన్ల డాలర్ల నష్టం నష్టం జరుగుతోంది. మన దేశంలో  భూమి వరదలకు 12శాతం ( 8శాతం) గురవుతోంది. ప్రకృతి వైపరీత్యాలైన తుపానులు, వరదల్లో మృతి చెందేవారికి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని ఇస్తోంది. ప్రకృతి విపత్తులు, బీమా రంగం తన పాత్రను ఎక్కువగా నిర్వర్తిస్తూ వస్తుంది. ఈ రంగం, కొన్ని నష్టాలను పూడ్చుటకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తుంది. హరికేన్లు, దావాలనాలు, ఇతర విపత్తులు సంభవించి నపుడు ఈ బీమా రంగం సాయం అందిస్తున్నది. పర్యావరణ పరిరక్షణ చట్టం(1986)కు అనుబంధంగా తీరప్రాంత నియంత్రణ నిబంధనల పేరిట కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్ జెడ్) నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 1991లో అమలులోకి తీసుకొచ్చింది. కొన్ని వర్గాల కార్యకలాపాలకు అడ్డుగా ఉన్న ఈ నిబంధనలను అమలు చేయడంలో ప్రభుత్వ వ్యవస్థ విఫలమయింది. విదేశీ నౌకా నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, అటవీ, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక చట్టాలు తీరప్రాంత పరిరక్షణతో ముడివడి ఉన్నాయి. 1991 నాటి నిబంధనల్లో తీరాన్ని మూడు విభాగాలు(సీఆర్ జెడ్-1,2,3)గా విభజించారు. ఆయా ప్రాంతాల్లో వివిధ నిర్మాణాలు చేపట్టడానికి నియంత్రణలు విధించాలి. అయితే పలు ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు ఇవి అడ్డుగా ఉన్నాయన్న ఉద్దేశంతో నిబంధనల్లో సవరణలు తీసుకొచ్చారు తప్పితే, నోటిఫికేషన్ లక్ష్యాలకు అనుగుణంగా నియమాలు అమలు చేసిన దాఖలాలు తక్కువ. సీఆర్జెడ్ నిబంధనలను 1991 మధ్య కాలంలో 12సార్లు సవరించి వివిధ అభివృద్ధి కార్యక్రమాల విస్తరణకు అనుమతించారు. ఈ నోటిఫికేషన్ అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్రాలదే. అయితే నిబంధనల అన్ని అభివృద్ధి కార్యక్రమాలను నియంత్రించి ప్రకృతి వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అభివృద్ధి పనుల పేరిట మడ అడవులు, హరితవనాలను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు నిధులు, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విపత్తుల యాజమాన్య ప్రణాళికల అమలు మొక్కుబడిగా మారాయి. 2011 నుంచి కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్మించ తలపెట్టిన బహుళ ప్రయోజక దశాబ్దాల క్రితంనాటి తుపాను షెల్టర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రకృతి వైపరీత్యాల నివారణకై, ప్రణాళికలను బడ్జెట్లో ప్రత్యేకంగా పొందు పరచాల్సిన అవసరం ఉంది. నష్టం అంచనాలో పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగ స్వాములను చేయాలి. ప్రకృతి వ్యవస్థలకు హాని కలగకుండా, గొలుసుకట్టు హరిత వనాల పెంపకానికి, మడ అడవుల పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ వనీకరణ నిధులను సమకూర్చాలి. వైపరీత్యాలకు దారి తీయకుండా తీరప్రాంత వనరుల వినియోగం జరిగేలా చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేయాలి. క్షేత్రస్థాయి నుంచి పైదాకా ప్రభుత్వ వ్యవస్థల స్పందన బట్టి బాధిత ప్రజలకు భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కో గలమనే ధైర్యం కలిగించాలి.

## డివైఎఫ్ఐ నిర్వహించే డీఎస్సీ మోడల్
# పరీక్షను సద్వినియోగం చేసుకోండి

**యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్ కుమార్**

**బద్వేల్ మే 24 (ప్రజా జ్యోతి న్యూస్)** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన జరిగే మోడల్ డీఎస్సీ పరీక్షను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ తెలిపారు. డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం డీఎస్సీ మోడల్ పరీక్ష సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు.

ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ మాట్లాడుతూ ముందుగా మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘం వారికి అభినందనలు తెలుపుతున్నాను అన్నారు డివైఎఫ్ఐ ఈ ఉద్యోగులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయం అన్నారు అభ్యర్థులకు రేపు ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు నమూనా డీఎస్సీ పరీక్ష చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు కాబట్టి జిల్లాలో ఉన్నటువంటి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నటువంటి నిరుద్యోగులు ఎక్కువ సంఖ్యలో డీఎస్సీ నమూనా పరీక్షను సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ మోడల్ పరీక్ష ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు గారు మేధావులతో నిపుణులతో తయారు చేయిస్తున్నటువంటి ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ మంచి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన తెలియజేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, సిఐటియు జిల్లా కార్యదర్శి కాలువ నాగేంద్రబాబు లు మాట్లాడుతూ. ఈనెల 28 నిర్వహించే మోడల్ డీఎస్సీ పరీక్షలో నిరుద్యోగ అభ్యర్థులందరూ పాల్గొని పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నామన్నారు ఈ పరీక్ష



కేవలం ఎస్జిటి అభ్యర్థులకు మాత్రమే నిరుద్యోగ అభ్యర్థులు గమనించాలని కోరారు. ఈ ప్రశ్న పత్రాన్ని ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు గారు చేత తయారు చేయబడుతుందని రేపు ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు ఈ నమూనా పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పరీక్ష జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని నిరుద్యోగ అభ్యర్థులు గమనించాలని గౌతమ్ జూనియర్ కాలేజ్ నందు పరీక్ష కేంద్రంగా నిర్వహించడం జరుగుతుందని పేర్లు కూడా 50 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరుతున్నామన్నారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు బద్వేల్ 9059 414222' 7799506227' 824723 631 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. 28వ తేదీ ఉదయం 9:30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని 10 గంటల నుండి ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్ ,బద్వేల్ రూరల్ కార్యదర్శి ముడుమాల ఓబుల్ రెడ్డి, పట్టణ నాయకులు సోమేశుల నరసింహ ,చరణ్ తదితరులు పాల్గొన్నారు.


## తుడా అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేద్దాం. - చైర్మన్ సి.దివాకర్

**మే 24,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజాజ్యోతి)** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేద్దామని తుడా చైర్మన్ సి.దివాకర్ అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆయా విభాగాల అధికారుల విధులు తదితరాలను ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని అభివృద్ధికి సహకరించాలని అన్నారు. తుడా పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి పనులు, లే అవుట్ల ఏర్పాటు పారదర్శకంగా జరిగేలా అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని అన్నారు. తుడా నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. తుడా లో జరుగుతున్న అభివృద్ధి ఇతర సంస్థలకు ఆదర్శంగా ఉండేలా అందరూ పనిచేయాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న లే అవుట్లలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అధికారులు, సిబ్బందికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని అందరూ నిబద్ధతతో విధులు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో సెక్రెటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్




ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, ఉద్యానవన శాఖాధికారి మాలతి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మోడల్ డీఎస్సీ నిర్వహించడం హర్షనీయం





**గుంతకల్లు మే 24 (ప్రజా జ్యోతి):** ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మోడల్ డీఎస్సీ పరీక్షను గుంతకల్లు పట్టణం శ్రీశైల భ్రమరాంబ డిగ్రీ కాలేజ్ నందు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ మస్తాన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ మస్తాన్ మాట్లాడుతూ ఎస్ ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మోడల్ డీఎస్సీ నిర్వహించడం చాలా గొప్ప విషయమని మెగా డీఎస్సీ 16 వేల పైచిలుకు ఉపాధ్యాయ ఉద్యోగాలను నోటిఫికేషన్ ఇవ్వడం ద్వారా నిరుద్యోగుల పాలిట వరంలా మారింది, దీనికి అనుసంధానంగా గుంతకల్లు పట్టణం నందు ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి రాయల్ రంగ ఈ మోడల్ డీఎస్సీని ఏర్పాటు చేసి అభ్యర్థుల్లో ఒక ధైర్యాన్ని నింపడం కోసం ఆయన చేసిన కృషి అలాగే మొదటిసారి డీఎస్సీ పరీక్షను ఎదుర్కొనేవా రుఈ మోడల్ డీఎస్సీ ఎంతగా నో ఉపయోగపడు తుంది.ఈ మోడల్ డీఎస్సీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థు లందరికీ శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఎస్సార్ ఎడ్యుకేషన్ సంస్థ కార్యదర్శి రాయల్ రంగ మాట్లాడుతూ నిరుద్యోగుల పాలిట వరమైన డీఎస్సీ అభ్యర్థుల్లో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా మోడల్ డీఎస్సీని నిర్వహించ డానికి ఎంతో శ్రమించామని గుంతకల్లు పట్టణంలోని శ్రీశైలం భ్రమరాంబ డిగ్రీ కాలేజ్ నందు ఏర్పాటు చేశామని,ఈ మోడల్ డీఎస్సీ నందు పాల్గొని జయప్రదం చేసినందుకు మరి ముఖ్యంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సి ఐ మస్తాన్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

# మహానాడు 2025 ను జయప్రదం చేయండి

## నంద్యాల నియోజకవర్గ మహానాడు అబ్జర్వర్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్

**నంద్యాల జిల్లా:బ్యూరో మే24(ప్రజా జ్యోతి)** కడపలో ఈనెల 27 , 28 , 29 లలో జరుగు టిడిపి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నంద్యాల నియోజకవర్గ మహానాడు అబ్జర్వర్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తెలిపారు ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తో భేటీ అయి పలు అంశాలపై వారి ఇరువురు చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా అబ్జర్వర్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు 2025 ను జయప్రదం చేయాలని వార్డ్ ఇన్చార్జ్ లకు , టిడిపి నాయకులకు తెలియజేశారు . 27 , 28 ప్రతినిధుల సభ ఉంటుందని అలాగే ఆ సభలో తీర్మానాలు కూడా చేస్తారన్నారు . 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచిభారీ బహిరంగ సభ ఉంటుందని ఈ సభను విజయవంతం చేయాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎస్ ఎస్ జి ఎస్.కళాశాల డైరెక్టర్ గోపాల్




**గుంతకల్లు మే 24 (ప్రజాజ్యోతి):'** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాల డైరెక్టర్ పి.గోపాల్ అన్నారు. శనివారం బీకాం కంప్యూటర్ చివరి సంవత్సరం విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ పాల్గొని ప్రసంగించారు. నేటి సమాజంలో విద్యతోనే గుర్తింపు ,హెూదా లభిస్తుందని ఆయన తెలిపారు.చదువుకునే రోజుల్లోనే విద్యార్థులు తమ జీవితాలను ఎలా తీర్చిదిద్దుకో వాలో ఆలోచించి అందుకు తగినట్లు నిర్ణయాలు తీసుకో వాలన్నారు.పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చు నని తెలిపారు.విద్యార్థులు ఉన్నతంగా రాణించినప్పుడే తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు వస్తుందన్నారు. భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని ఆయన ఆకాంక్షిం చారు.కళాశాల వదిలి వెళ్ళిన తర్వాత వారు ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ఆయన తెలిపారు.సీనియర్లు విడిపోతుంటే జూనియర్ల సైతం వారు బాధను వ్యక్తం చేస్తూనే విద్యార్థులందరూ ఆనందంగా గడిపారు. విద్యార్థుల ఆటపాటలతో సందడి చేశారు.జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి వెంకటేశ్వర్లు, డాక్టర్ వరప్రసాద్,డాక్టర్ సుభాషిణి,డాక్టర్ అమీర్, డాక్టర్ మహేష్,తిలక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారిని హతమార్చిన మానవ మృగాన్ని ఉరి తీయాలి - ఆవాజ్ డిమాండ్



**బద్వేల్ మే 24 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలోని ఆవాజ్ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది ,ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ,కడప జిల్లా అధ్యక్షులు పి , చాంద్ భాషా ,బద్వేల్ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్ ,అబ్దుల్ సత్తార్ లు మాట్లాడుతూ నిన్నటి దినం కడప జిల్లా మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో నాలుగేళ్ల అభం శుభం తెలియని చిన్నారిని అరటిపండు ఇస్తానని ఆశ చూపించి మానవ మృగం రహమతుల్లా అలియాస్ కబీర్ చిన్నారి పై లైంగిక దాడి చేసి చిన్నారి నీ బండరాయితో కొట్టి హతమార్చాడు చిన్నారిని మృతదేహాన్ని ముళ్లపదల్లో పారేసి ఏమి తెలియనట్టు అమాయకంగా నటిస్తూ ఉన్నాడు ,చిన్నారి తల్లిదండ్రులు పొద్దుటూరు పట్టణం నివాసం ఉంటున్నారు బంధువుల పెళ్లికి కంబాలదిన్నె వచ్చి తల్లిదండ్రులు పెళ్లిలో ఉండగా నిందితుడు చిన్నారిని తీసుకుని వెళ్లి ఇంత ఘోరం చేశారన్నారు. చిన్నారి కనపడకుండా పోయేసరికి ఆ ప్రాంతమంతా వెతకగా నిందితుడు ర హమతుల్లా ఏమి తెలియనట్టు అమాయకంగా కూర్చుని ఉన్నాడు అతనిపైన అనుమానం వచ్చి అడగగా నాకేమీ తెలియదు అని నటించాడు అతని చొక్కాకు రక్తం మరకలు ఉండగా తల్లిదండ్రులు గట్టిగా నిలదీయడంతో అతను పారిపోయేదానికి ప్రయత్నం చేశాడు అతన్ని పట్టుకొని విచారించగా జరిగిన ఘోరాన్ని అతడు ఒప్పుకున్నాడు అక్కడ ఉన్న ప్రజలు నిందితుడికి దేహ శుద్ధి చేయగా పోలీసు వారు వచ్చి అతని తీసుకెళ్లారు,ఇంత ఘోరానికి పాల్పడిన మానవ మృగాన్ని ఉరిశిక్ష వేయాలని వారు అన్నారు. చిన్నారి తల్లిదండ్రులకు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు, రాష్ట్ర హెూమ్ మినిస్టర్ ,మరియు రాష్ట్ర ప్రభుత్వం చిన్నారి తల్లిదండ్రులకు అండగా ఉండి మానవ మృగానికి ఉరిశిక్ష పడేలా కఠినంగా వ్యవహరించి చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు , ఈ సమావేశంలో ఆవాజ్ నాయకులు కే బి రసూల్ ,ఎస్ ఖాజ గౌస్ ,ఎస్ మస్తాన్ ,ఎస్ అన్వర్ ,ఎస్ నాగూర్ పాల్గొన్నారు.

## కాలనీలలో మౌలిక సౌకర్యాలుదుర్భరం. సిపిఎం.



**పోదూరు /పెనుగొండ, మే 24,ప్రజాజ్యోతి న్యూస్.** జగనన్న కాలనీలలో రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సౌకర్యాలు అసంపూర్ణంగా ఉన్నాయని, గత ప్రభుత్వం వీటిని పూర్తి చేయకుండా వదిలేసిందని విమర్శలు ఉన్నాయి. కానీ జగన్ కాలనీలలో నివసించే ప్రజల పరిస్థితి మరీ దుర్భరంగా ఉందని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. సిద్ధాంతం గ్రామ శివారు ఘటాల దిబ్బ శివారు కాలనీని శనివారం సందర్శించినప్పుడు ఎటువంటి మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఈ లోపాలను సరిచేయడానికి తగిన చర్యలు తీసుకోవడంలో చొరవ చూపాలి అన్నారు. ఈ కాలనీలలో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన రోడ్మ్యాప్ లేదా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, మౌలిక సౌకర్యాల అభివృద్ధిని మరింత ఆలస్యం చేయ చేయకుండా ఈ కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వర్షం వస్తే కాలనీ మునిగిపోతున్నదని, గుంతలలో నీళ్లు నిల్వ వలన దోమలు పెరిగి జ్వరాలు సంభవిస్తు న్నాయని కాలనీ వాసులు తెలిపారు. తాత్కాలికంగా గ్రావెల్ రోడ్లు నిర్మాణం చేపట్టాలని అన్నారు. కిలోమీటర్ దూరంలో ఉన్న జగన్ కాలనీకి చీకటి పడితే మహిళలు చిన్నపిల్లలు రాకపోకలకు భయ పడుతున్నారని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 30 నుండి 40 కుటుంబాల వరకు నివాసం ఉన్న ఈ ప్రాంతంలో త్రాగునీరు ట్యాంకుల ద్వారా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావకాశాలను మైనారిటీ ఉర్దూ విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

**విద్యతోనే ఉన్నత స్థాయి సాధ్యం.**

**ఉర్దూ భాష అభివృద్ధి కి ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తాము**

**డీ ఎస్ సి ఉర్దూ మెటీరియల్ పంపిణీ చేసిన టి. డీ. పి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**



**నంద్యాల జిల్లా : బ్యూరోమే24 (ప్రజా జ్యోతి):** నంద్యాల.. మైనారిటీల విద్యాభివృద్ధి కేంద్రం( సి ఈ డి ఎం) తయారుచేసిన డి ఎస్ సి ఉర్దూ మెటీరియల్ను స్థానిక ఎన్ టి. ఆర్. ఫంక్షన్ హాల్ లో జొయ ఉర్దూ కోచింగ్ సెంటర్ లో శిక్షణ పొందిన 150 మంది ఉర్దూ అభ్యర్థులకు నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, యువకులకు మార్గదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అభ్యర్థులకు పంపిణీ చేశారు.
జొయ ఉర్దూ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సి. అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు.. ఇతర అతిథులు గా జొయ ఉర్దూ కోచింగ్ సెంటర్ కొ. ఆర్డీనేటర్ ఫజ్జులూర్ రెహమాన్, ప్రముఖ బహు బాష కవి సత్తార్ ఫైజి, ఇమాముల సంఘం జిల్లా అధ్యక్షులు అంజద్ బాష సిద్ధిఖి, ఆంధ్ర ప్రదేశ్ ఉర్దూ టిచర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రసిడెంట్ కే. జి. ఖాజ హూసెన్, రాష్ట్ర కన్వీనర్ సి. అబ్దుల్ అజీజ్, అధ్యక్షురాలు షమీంబాను, తదితరులు పాల్గొన్నారు..
మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మీద వ్రాసిన కవితల ను సత్తార్ ఫైజి చదివి వినిపించారు, హాజరైన వారు ఉల్లాసము గా, ఉత్సాహం గా విన్నారు..
ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులకు, ఉర్దూ భాష అభివృద్ధి కి, జొయ ఉర్దూ కోచింగ్ సెంటర్ కు ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తూ,ఉర్దూ అభ్యర్థులు డీ. ఎస్. సి లో మంచి ర్యాంకులు సాధించటకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్. ఎమ్. డీ ఫారూఖ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ అభ్యర్థుల కు ఉచిత మెటిరియల్ పంపింపిని చేయుటకు చర్యలు తీసుకుడం తొ ఉర్దూ అభ్యర్థుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు..
అంజద్ భాషా సిద్ధిఖి, ప్రముఖ అడ్వకేట్ ఖలీల్ మాట్లాడుతూ యువకులకు మార్గదర్శి గా ఉంటూ రాజకీయం లో రానిస్తున్న ఎన్. ఎమ్. డీ ఫిరోజ్ కు రాజకీయం లో మంచి భవిష్యత్తు ఉంటుందని, రాజకీయ ఉన్నత పదవులు పొందాలని మనస్పూర్తిగా కొరుకుంటున్నారు.
ఈ సందర్భంగా ఎన్. ఎమ్. డీ ఫిరొజ్ మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత స్థాయి సాధ్యం అవుతుందని, సమాజంలో ఏ రంగంలో రాణించాలన్నా విద్య అవసరం, ఆవశ్యకత ఎంతో ముఖ్యమని అన్నారు. డి ఎస్ సి అభ్యర్థులు చదువును ఇష్టపడాలని, విజయం సాధించడానికి దృఢ సంకల్పంతో కష్టపడి ఫైరొజ్ సూచించారు ఉర్దూ విద్యార్థులకు విద్యా పరం గా జొయ ఉర్దూ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో చేస్తున్న అబ్దుల్ అజీజ్, అధ్యాపకులు బృందం ల కృషి ని కొనియాడారు..
తదనంతరం జొయ ఉర్దూ కోచింగ్ సెంటర్ లో శిక్షణ పొందిన అభ్యర్థుల కు ఎన్ఎండి ఫిరోజ్ చేతుల మీదుగా ఉచిత ఉర్దూ డీ. ఎస్. సి మెటీరియల్ ను పంపిణీ చేశారు..
ఈ కార్యక్రమంలో టి. డీ. పి నాయకుడు భీమ్ శంకర్, తోట రామయ్య పెద్దా సంఖ్య లో విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవవైద్యంపై రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీల్లో ఎస్వీయూ విద్యార్థికి మొదటి స్థానం

**అభినందించిన ఉన్నతాధికారులు**



**మే 24,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో జీవ వైవిధ్యం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మదనపల్లి లో గల జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల బీఎస్సీ బయోటెక్నాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని గుణ విజయ మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి పోటీల్లో పద్మావతి డిగ్రీ కళాశాల బీఎస్సీ జువాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని దీప్తి మొదటి స్థానం పొందారు. ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి - గ్రీన్ క్రాప్ సంయుక్తంగా ఈ పోటీలు చేపట్టాయి. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులు గుణ విజయ, దీప్తిని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు, యూనివర్సిటీ కల్చరల్ కో- ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి అభినందించారు. రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీల్లో యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

# డిస్టిలరీ యూనిట్ విస్తరణ కొరకు ప్రజాభిప్రాయ సేకరణ





**తాళ్లపూడి, మే24, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామపంచాయతీలో ఉన్న మెసర్స్ క్యాప్రీకార్న్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, ప్రస్తుత పరిశ్రమ యొక్క ఆవరణలో తాళ్లపూడి మండలం, తూర్పుగోదావరి జిల్లాలో డిస్టిలరీ యూనిట్ విస్తరణ కొరకు శనివారం ఉదయం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణ ఆర్డీఓ రాణి సుస్మిత సమక్షంలో జరిగింది. కార్యక్రమానికి చుట్టు ప్రక్కల గ్రామాలు ప్రజలు పాల్గొని వారి అభిప్రాయాలు వ్యక్త పరచారు. ఈ సంస్థ రావడం వలన స్థానిక యువత ఉపాధి పొందారని మునుముందు ఇంకా యువత కి ఉపాధి రావాలని అన్నారు. ఈ ఫ్యాక్టరీ వలన మాకు ఏం ఇబ్బంది లేదనిపర్యావరణానికి ఉపయోగపడే మొక్కలు నాటాలని, స్థానికి పంచాయతీలకు కూడా సంస్థ తరుపు నుండి అభివృద్ధి చెయ్యాలని అన్నారు. అలాగే పేద విద్యార్థులకు ఆర్థికంగా ఆదుకుంటూ ప్రోత్సాహన్ని ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుష్మిత మాట్లాడుతూ 20 మంది సభ్యులు మాట్లాడారని 25 లిఖితపూర్వక పత్రాలు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, తహసిల్దార్ మోహన భారతి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యం,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సహాయమంటే మనకు తోచినప్పుడు సహాయం చేసేది కాదు ఎదుటివారికి అవసరమైనప్పడ సహాయం చేయాలి

**శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆశీస్సులతో 839 వ రోజు నిత్యాన్న ప్రసాద వితరణ**



గుంతకల్లు మే 24 (ప్రజా జ్యోతి): కసాపురం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం లో శనివారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నిర్వహించి 839వ రోజు అన్న ప్రసాద వితరణ దేవస్థానం ధర్మకర్తలు పరశు రాముడు తలారి శకుంతలమ్మ కూతురు అల్లుడు మయూరి రఘు దంపతుల చేతుల మీదుగా అన్న ప్రసాద వితరణ జరిగినది.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదు స్వీకరించడం జరిగినది. అనంతరం రఘు మాట్లాడు తూ ఇంతటి మహా క్షేత్రము నిత్య అన్నదానం చేయడము ప్రతినిత్యం ఎంతోమంది అనాధలు సాధువులు బిక్షాటన చేసుకునే వృద్ధులు దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాదాచారులు వందల మందికి భోజనం ప్రతిరోజు జరుగుతుంది.ఎన్ని కోట్లు ఉన్నా ఎవరికి సాధ్యం కానిది ఎవ్వరూ చేయనటువంటి ఇంతటి శాశ్వత పుణ్యా కార్యాన్ని చేసిన మా అత్తమామలకు నిండు నూరేళ్లు అష్ట ఆయురారోగ్యా లను శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారు ఇవ్వాలని కోరుచున్నాము.పరశురాముడు మాట్లాడుతూ ఈ దైవ పుణ్యకార్యాలలో భక్తులు భాగస్వాములు అవుతున్నం దుకు చాలా సంతోషంగా ఉంది.జీవితమంటే మనము చచ్చే వరకు బ్రతకడం కాదు పదిమంది మనసులో పది కాలాలపాటు జీవించడమే జీవితం.సహాయం చేయడం అంటే మనసుకు తోచినప్పుడు తోచినంత సహాయం చేయడం కాదు ఎదుటి వారికి అవసర మైనప్పుడు అవసరమైనంత సహాయం చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదాన ఆలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొనడం జరిగినది.

# వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొని పోరాటాన్ని కొనసాగిస్తా.

## వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు కొర్రపాటి వీరస్వామి.



**పోడూరు మే 24 ప్రజాజ్యోతి న్యూస్ :** ఇటీవలే పోడూరు మండలం వైఎస్ఆర్సిపి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కొర్రపాటి వీరాస్వామిని శనివారం తూర్పు పాలెం పార్టీ క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, చెరకువాడ శ్రీరంగనాధరాజు కు దుస్సాలువా కప్పి పూల మాలలతో అభినందించారు, అలాగే నిస్వార్థ సేవ పరుడిగా వైయస్సార్సిపి నియమ నిబంధనలకు కట్టుబడి కష్టపడి పనిచేసి మండలం లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలియజేశారు.తదనంతరం మండల పార్టీ అధ్యక్షులు కొర్రపాటి వీరాస్వామి మాట్లాడుతూ మండల నూతన అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుని, ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంతవరకు కలవలేదని,ఈరోజు అవకాశం దొరకడంతో ఆయనను కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నందుకు తనకెంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. అలాగే పార్టీ కోసం ఎన్ని కష్టనష్టాలకైనా ఓర్చుకుని, ఎటువంటి ఇబ్బందులునైనా ఎదుర్కొని మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవరకు పార్టీ పిలుపుమేరకు ఎటువంటి కార్యక్రమాల్లో నైనా పాల్గొని తన పోరాటాన్ని కొనసాగిస్తానని అన్నారు. ముఖ్యంగా పాలకొల్లు నియోజకవర్గం లో గుడాల గోపిని, ఆచంట నియోజకవర్గంలో చెరుకువాడ శ్రీరంగనాథరాజుని ఎమ్మెల్యేలుగా గెలిపించుకుంటామని తెలిపారు. శనివారం తూర్పు పాలెం పార్టీ క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుని మర్యాదగాపూర్వకంగా కలిసిన వారిలో జడ్పిటిసి గుంటూరి పెద్దిరాజు, వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, వైయస్సార్సీపి కార్యకర్తలు, తదితరులుపాల్గొన్నారు.

# అధ్యక్షుడు నియామకం పైహర్షం వ్యక్తం చేసిన మండల పార్టీ నాయక లు.



**అనంతగిరి మే.24 ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్.శంకర్.:** తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గం ఇంచార్జ్ మరియు విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్.శివేరి దో న్ను దొర. అనంతగిరి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా సోవెరీ సుబ్బారావును నియమించడంపై. అనంతగిరి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు వంజరపు శంకరరావు. పాంగి భీమన్న. పాంగి రవీంద్ర.పాంగి బా బి. చిట్టిబాబు. సిరగం దేముడు. వెంకట్రావు. నాగేష్. కార్యకర్తలు. అభిమానులు శనివారం నాడు మండల కేంద్రమైన అనంతగిరి విగ్రహం వద్ద సమావేశమై. నూతనంగా ఎన్నికైన సుబ్బారావును అభినందిస్తూ. మిఠాయిలు పంచి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ.పార్టీ ఆదేశాలు తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని. అలాగే పార్టీ నాయకులు కార్యకర్తలను ఒకే తాటిపై తెచ్చి వారి సలహాలు సూచనలు పాటిస్తూ పార్టీ సేవకే అంకితం చేస్తానని రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో అన్ని స్థానాలు విజయం కొరకు పాటుపడతానని అన్నారు. నా మీద ఎంతో నమ్మకముతో. అధ్యక్ష పదవి అప్పగించిన నాయకుడు దొరకు కృతజ్ఞతలు తెలిపారు.

# వైస్సార్సీపీ అడ్వైజర్ కమిటీ మెంబర్గా మాజీ మంత్రి చెరుకువాడ.

**రంగనాధారాజు ను పూలమాలతో సత్కరించి అభినదించిన నాయకులు, కార్యకర్తలు.**



**పోడూరు, మే 24,ప్రజాజ్యోతి న్యూస్. (రిపోర్టర్ కె కె ఆర్ వెంకట్ ).** పోడూరు మండలం తూర్పుపాలెం వైసీపీ కార్యాలయం లో శనివారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధ రాజుని అధినేత జగన్మోహన్ రెడ్డి వైస్సార్సీపీ అడ్వైజర్ కమిటీ మెంబర్ గా నియమించడంతో శనివారం పార్టీ కార్యాలయం లో పోడూరు మండలం జడ్పీటీసీ గుంటూరి పెద్ది రాజు,వైస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు, పోడూరు మండలం వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు కొర్రపాటి వీరాస్వామి, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రదాన కార్యదర్శి దేవ రాజేష్ ,సినియర్ నాయకులు మామిడి శెట్టి చిట్టిబాబు, కార్యకర్తలు తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి బుకే అందజేసి, పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లో ని పార్టీ బలోపేతానికి ప్రతివొక్కరు కృషిచేయాలనీ కోరారు.అనంతరం ఇటీవలే వైసీపీ మండల అధ్యక్షులు గా నియమితులైన కొర్రపాటి వీరాస్వామిని అభినదించారు. వీరాస్వామి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తిస్తాయిల తనవంతు కృషిచేస్తానని అన్నారు.

# పలు ప్రజా సమస్యలపై స్పందించిన బిజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి.నాగేంద్ర

**తాళ్లపూడి,మే24, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి బిజెపి కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి. నాగేంద్ర మాట్లాడుతూ పర్యటనకు వెళ్లిన భారత 26 మంది యాత్రికులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్న పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై ఉక్కు పాదం మోపి ఆపరేషన్ సింధూర్ ద్వారా ఆడపడుచుల నుదుటిన తొలగించిన సింధూరానికి ప్రతీకారం ద్వారా న్యాయం జరిగిందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం అధోగతి పాలు అయిందని అన్నారు. రాష్ట్రం లో డబల్ ఇంజన్ నడుస్తుందని .రాష్ట్రం మరింత అభివృద్ధి పదంలో దూసుకెళ్తుంది అని ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో చనిపోయిన వారి పేరు మీద మరియు ఊర్లో లేని వారి పేరు మీద జాబ్ కార్డు ఇచ్చి ఫీల్డ్ ఆఫీసర్లుఅవకతవకలుపాల్పడుతున్నారని ఇప్పటికైనా మారిసక్రమంగా పనిచేయాలని లేనిచో పీజిఆర్ ఎస్ మీకోసం లో కలెక్టర్ కి నివేదిక ఇచ్చి సంబంధిత వారిపై చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికచేపడతామనితెలిపారు. రాబోయేవర్షాకాలంలో భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పడకుండా ముందుగానే ఇసుక డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం జరిగిందని ఆ ఇసుకను డంప్ చేసే ప్రక్రియలో వాహనాల నుంచి జారిపడిన ఇసుక రోడ్డుపై పడి ప్రయాణికులు ప్రమాదాలకుగురవుతున్నారని కావున ర్యాంప్ నిర్వహకులు రోడ్లపై ఇసుకను తొలగించి చర్యలు తీసుకోవాలని లేకపోతే రెండు రోజుల్లో యాడ్లను సందర్శించి దానికి కారణమైన వారి మీద చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం



జరుగుతుందని తెలిపారు. అలాగే తాళ్లపూడి బస్టాండ్ ఉపయోగానికి నోచుకోని ప్రదేశంలో ఉండటం వలన ప్రయాణికులు అవస్థలు పడుతున్నందున తాళ్లపూడి కార్యవర్గం జిల్లా అధ్యక్షులు కి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించవలసిందిగా కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ,కలిశెట్టి సన్యాసినాయుడు, జితేంద్ర. రవి, తిరుమల శెట్టి కృష్ణ, నామా. రంగయ్య, నక్కా. వెంకటేశ్వరరావు, ముప్పిడి రాజేష్, నామా భీమరాజు, బత్తుల విష్ణు, కిలాని వెంకటరమణ, పామర్తి పవన్, మదేపల్లి రాజు, ప్రగడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# జిల్లా పరిధిలోని సముద్రతీర ప్రాంతాలలో డ్రోన్‌లతో నిఘా

జిల్లా ఎస్పీ తుషార్ డూడి..

యాత్రికుల భద్రతకు ప్రాధాన్యం..

సూర్యలంక, రామాపురం బీచ్లలో డ్రోన్లతో పర్యవేక్షణ..

ఎక్కువ సంఖ్యలో యాత్రికులు రానున్న నేపథ్యంలో ప్రతిష్ట భద్రతా చర్యలు..







**బాపట్ల, మే 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** యాత్రికుల రక్షణ,భద్రతకుప్రాధాన్యతనిస్తూ సముద్రతీర ప్రాంతాలలో నిఘా కోసం డ్రోన్ లను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో పోలీస్ అధికారులు శనివారం బాపట్ల జిల్లాలోని సూర్యలంక, రామాపురం బీచ్ లలో, వాడరేవు సముద్రతీర ప్రాంతాలలో డ్రోన్ లను ఎగురవేసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్ లలో ఆహ్లాదకరంగా గడిపేందుకు చుట్టుపక్క ప్రాంతాల నుండే కాక ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి యాత్రికులు వస్తుంటారన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కనుక యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా సముద్ర తీర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అలాగే అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టే ఉద్దేశంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ డ్రోన్ లతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ లను సముద్ర తీరాలలో ఎగరవేసి వాటి ద్వారా యాత్రికులు ఎవరైనా ఎక్కువ లోతుకు వెళుతున్నట్లయితే వారిని గుర్తించి హెచ్చరించడం, ఎవరైనా ప్రమాదానికి గురి అయినట్లయితే వెంటనే గజఈతగాళ్లు, అవుట్ పోస్ట్, మెరైన్ పోలీసులను అప్రమత్తం చేసి వారిని కాపాడడం, యాత్రికులకు, మహిళలకు అసౌకర్యం కలిగించే ఆకతాయిలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు, సముద్రతీర పరిసర ప్రాంతాలలో అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడిచేసేందుకు డ్రోన్ లను వినియోగిస్తున్నామని తెలిపారు. యాత్రికులు పోలీస్ శాఖ సూచనలను పాటిస్తూ ఆహ్లాదకరంగా గడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ చేసే సూచనలు యాత్రికుల రక్షణకోసమేనని గ్రహించి పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

## ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాల గుర్తింపు పై అధికారులసమావేశం.







**అనంతగిరి మే. 24 ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్.శంకర్.** అనంతగిరి మండలంలో గల ప్రభుత్వ భూములలో అక్రమ భవన నిర్మాణాలు గాని ఇతర నిర్మాణాలు గానీ జరిగి ఉంటే తక్షణ ప్రభుత్వ భూములు నిర్మాణాలు గుర్తించి నివేదిక సమర్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ అనంతగిరి మండల ఎం.పీ.డీ.వోకు ఆదేశాలు జారీ చేయడంతో.మండల శాఖ అధికారులు తాసిల్దార్. ఎస్సై. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్.మండలసర్వేర్ మరియు గ్రామ సర్వేలు.ఇతర సిబ్బందితో శనివారం నాడు అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎం.పీ.డీ.వో కుమార్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలు గుర్తించి 28. తేదీలోపు నివేదిక అందజేస్తే 30. తే.దీలోపు జిల్లా అధికారులకు వివరాలు అందజేసిన.అనంతరం అక్రమ దారులకు లుక్ నోటీసులు జారీ చేస్తారని తదుపరి చర్యలు అధికారులు తీసుకోవడం జరుగుతుందని. ఎం.పీ.డీ.వో కుమార్ సూచించారు. సమావేశానికి అనంతగిరి పోలీస్ స్టేషన్ ఏ.ఎస్ఐ. ఆర్.ఐ. గ్రామ సర్వేలు హాజరయ్యారు.

## నిబంధనలు పాటించకపోతే లైసెన్సు లు రద్దు చేస్తాం

మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎక్సైజ్ సి. ఐ వై రాజు



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే లైసెన్సు లు రద్దు చేస్తామని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్ వై రాజు అన్నారు. పొందూరు సర్కిల్ పరిధిలో ఏ 4 షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ 4 షాపుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. షాపు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అనధికార మద్యం విక్రయాలు ,త్రాగటం చేయకూడదని సూచించారు. ఉదయం 10 గంటలకు దుకాణాలను తెరచి ,రాత్రి 10 గంటలకు మూసివేయాలని సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. లైసెన్స్ ధరలు చట్టపరమైన మద్యం విధానాలకు కట్టుబడి ఉండాలని తెలిపారు.

## క్లస్టర్ పాఠశాలకు సామాగ్రి పంపిణీ



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్:** పొందూరు క్లస్టర్ పాఠశాలలకు క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాలి శెట్టి వెంకటరావు తమ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలకు మెటీరియల్ (మెగా మైక్ , స్టేషనరీ మెటీరియల్ )పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొందూరు మండల విద్యాశాఖ అధికారులు గట్టు శ్రీరాములు , పట్నా రాజారావు పాల్గొని సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలపై పర్యవేక్షణను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. విద్యారంగం బలోపేతానికి ఈ విధానం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పొందూరు సి.ఆర్.ఎం.టి శేఖర్, ప్రధానోపాధ్యాయులు గురుగుబెల్లి మధుబాబు, అల్లంశెట్టి రవి, దండా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వాడ కాలువ ఆధునీకరణ పనులు ప్రారంభం



**తాళ్లపూడి ,మే 24, ప్రజా జ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం పోచవరం గ్రామంలో కొవ్వాడ కాలును పరిశీలించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అధిక వర్షాలు కురిసినప్పుడు కొవ్వాడ కాలువ పరిసర పంట పొలాలు నీట మునిగి రైతులు అధికనష్టాలకుగురవుతున్నారని అన్నారు. రైతు కష్టాలు తెలిసిన కూటమి ప్రభుత్వం కొవ్వాడ కాలువ ఆధునీకరణ చేపట్టింది. అందులో భాగంగా తాళ్లపూడి మండలం తాడిపూడి, గజ్జరం, రాగోలపల్లి, అన్నదేవరపేట, చాగల్లు బ్రాహ్మణగూడెం కొవ్వాడ కాలువ పూడిక తీత పనులు పనులు ప్రారంభించిన కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమంలో టుమెన్ కమిటీ సభ్యులు, ఏ ఏం సి చైర్మన్, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు

## జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణి



**తాళ్లపూడి, మే 24, ప్రజా జ్యోతి న్యూస్** కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు నామన చిన్న బూరయ్య అధ్యర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జనసేన నియోజకవర్గం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే టీ. వి. రామారావు మరియు జిల్లా కార్యదర్శి గాయత్రీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ టీ. వి. రామారావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియలో జన సైనికులు తమ వంతు కృషి చేసారని హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సిద్ధంశెట్టి స్వామి నాయుడు, వార్డు మెంబెర్ ముపనపల్లి వీరబాబు, గంగిరాజు దివాకర్, బాధనల రామసూర్య, గంట శ్రీను, గెడ్డం విజయ భాస్కర్, నామన దుర్గ ప్రసాద్, వేము సాయి,పసలపూడి ప్రసాద్, వీర మహిళ పసలపూడి వెంకటలక్ష్మి, జన సైనికులు, నాయకులు, వీర మహిళలు మరియు జనసేనా క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు

## పట్టిసీమ సుదర్శన కళ్యాణ వెంకటేశ్వరస్వామికి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలయ అర్చకులు శంకరమంచి వెంకట్రామ శర్మ



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ మే 24** పట్టిసీమ సుదర్శన కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం తాడిపూడి గూటాల ఎల్ ఎన్ డి పేట రేపల్లివాడ దొండపూడి తాళ్ళపూడి గోపాల పురం మండలాల నుండి మహిళా భక్తులు కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న గరుత్మంతుడు, ఆంజనేయుడు పంచముఖ ఆంజనేయుడు, శ్రీకృష్ణుడి విగ్రహాలకు గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిష్ణు సహస్రనామార్చన, అష్టోత్తర పూజలు, తులసి దళార్చన కార్యక్రమాలు ఆలయ అర్చకులు శంకరమంచి వెంకట్రామ శర్మ ఆధ్వర్యంలో అర్చకలు పండితులు నిర్వహించారు. ఆలయ కమిటీ మహిళలు ఉదయం భక్తులకు పులిహోర, శెనగలు, పాయసం ప్రసాద వితరణ, కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు అన్న ప్రసాదాలు స్వీకరించారు. పోలవరం నాగరేశ్వరస్వామి, నూతనగూడెం శ్రీ దత్త వెంకటేశ్వరస్వామి, బోడిగూడెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో, పాతపోలవరం అలివేలుమంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో, గుంజవరం ఉమా సహిత బోగలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## హెల్మెట్ ధరించకపోతే జరిమానం..
## ఆర్. సి. బుక్కు లేకపోతే వాహనం సీజ్.



**అనంతగిరి ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్. శంకర్.** మండల కేంద్రమైన అనంతగిరిప్రధాన హదారి వద్ద శనివారము నాడు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ డి.శ్రీనివాసరావు. ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహించిన సమయంలో వాహనాలు డ్రైవింగ్ చేస్తున్న చోధకులు హెల్మెట్లు ధరించకుండా వావాహనాలను నడపటం.ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడం. చూసి కొంతమంది చొధకు లకు జరిమాణం విధించారు. అరకు రోడ్డు మార్గంలో వాహనాలు నడిపే చొధకులుతప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకుంటే జరిమాణం విధించడం జరుగుతుందని అదేవిధంగా వాహనాలకు అనుమతి పత్రాలు లేకపోతే సీజ్ చేయడం జరుగుతుందని. ఎస్సై శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వాహనదారులు తప్పక ఈ విషయం గమనించాలని కోరారు.

## వివాహానికి హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కా పక్కీరప్ప....



**ప్రజా జ్యోతి తుగ్గలి** నంద్యాల జిల్లా,ప్యాపిలి మండలం,కలచట్ల గ్రామంలో శ్రీమతి రమాదేవి,మామూర్తి గార్ల జ్యేష్ఠపుత్రుడు విజయ్ కుమార్,పల్లవి ల వివాహం శనివారం ప్యాపిలి శ్రీ లక్ష్మి నరసింహస్వామి కళ్యాణమండపం నందు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చక్కా పక్కిరప్ప హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవుల రాము,ఆవుల బాల కృష్ణ,జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రేషన్ షాపులను తనిఖీ చేసిన ఆర్డిఓ డాక్టర్ భరత నాయక్



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలంలోని రాతన గ్రామాలలో ప్రభుత్వ రేషన్ షాప్ లను శనివారం ఆర్డీవో డాక్టర్ భరత నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుండి రేషన్ షాప్ వద్దనే రేషన్ కార్డు దారులకు బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన తేదీ వరకు బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేయాలని తెలిపారు ప్రభుత్వ రేషన్ షాపులలో రికార్డులు ప్రకారం ఉండవలసిన స్టాకును ఈ పాస్ స్టాకు నిల్వను తనిఖీ చేశారు,ప్రభుత్వం పంపిణీ చేసే సరుకులలో అవకతవకలు జరిగితే ప్రభుత్వ నిబంధనల మేరకు కఠిన చర్యలు తప్పవని ఆర్డిఓ భరత్ నాయక్ హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసిల్దార్ నాగరాజు, వీఆర్వో నాగేంద్ర లు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం

**– జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు**





**రణస్థలం ,ప్రజా జ్యోతి న్యూస్ :** పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు ,రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు అన్నారు. రణస్థలం మండల కేంద్రంలో పంచాయతీ పరిధిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కాలువల్లో పూడికల్ని తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన చుట్టు ప్రక్కల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ పారిశుద్ధ్యం విషయంలో భాధ్యత వహించాలని కోరారు. ఎక్కడికక్కడ చెత్త వేయకుండా ఉండటం వల్ల రోగాలు బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాపట్ల మున్సిపల్ హై స్కూల్‌లో తరగతి గదుల నిర్మాణం వేగవంతం చేయాలి...

**అధికారులకు తగిన సూచనలు చేసిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ...**





**బాపట్ల మే 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల మున్సిపల్ హై స్కూల్‌లో 1.48 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కొత్త తరగతి గదుల పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులతో కలిసి ప్రాంగణాన్ని పర్యవేక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2014–19 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి అదనపు తరగతి గదుల మంజూరు చేసిందన్నారు. అయితే ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పనులు ఆగిపోయాయని గుర్తు చేశారు. తరువాత వచ్చిన ప్రభుత్వం ఈ నిర్మాణాలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి సమస్యను వివరించగా గత డిసెంబర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ స్వయంగా బాపట్లకు వచ్చి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేశారని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ముందు గదులను పూర్తిచేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ నాగిరెడ్డి, మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ బర్లీని చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం..

**మంత్రి కింజారపు అచ్చయ్య నాయుడు భరోసా..**

**పొగాకు రైతులు, కంపెనీ ప్రతినిధులతో ముఖాముఖి సమావేశం..**

**బ్లాక్ బర్లీ పొగాకు రెండు గ్రేడ్ల తో కొనుగోలు..**

**ప్రభుత్వం ఆరు సబ్ కమిటీలు ఏర్పాటు..**

**అవసరమైతే మార్క్ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు..**

**రైతులకు మంత్రి హామీలు..**








**బాపట్ల, మే 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పొగాకు రైతులు పండించిన బ్లాక్ బర్లీ ని చివరి ఆకు కొనే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజారపు అచ్చంనాయుడు భరోసా ఇచ్చారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతులు, బయ్యర్లుగా ఉన్న కంపెనీ ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం మార్టూరు మండలంలోని పర్చూరు శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. సుదీర్ఘ చర్చ అనంతరం బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను మంత్రి ప్రకటించారు.బ్లాక్ బర్లీ పొగాకును రెండు గ్రేడ్లతో కొనుగోలు చేస్తామని మంత్రి తెలిపారు. కామన్ వెరైటీ క్వింటా ధర 12 వేలకు, లో గ్రేడ్ రకాన్ని 6,000ల లతో కొనుగోలు చేయాలని ధరలను నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలలో హెచ్చు, తగ్గులు ఉన్నప్పటికీ నిర్ణయించిన ధరను అమలు చేయాలని కంపెనీలకు సూచించారు. పొగాకు కొనుగోలులో ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే మార్క్ ఫెడ్ ద్వారా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇందుకోసమే ఆరు సబ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కంపెనీల కు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కంపెనీల వద్ద సిబ్బంది లేకపోతే ప్రభుత్వ సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. వేర్ హౌసింగ్ గోడౌన్లను వినియోగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సంక్షోభం నుంచి రైతులను బయటకు తెచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి అచ్చంనాయుడు చెప్పారు. కంపెనీలు కథలు చెప్పడం మాని రైతులకు మేలు చేసే ఉద్దేశంతో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కంపెనీలు స్పందించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారనే విషయాలను గుర్తించాలన్నారు. బయ్యర్లుగా ఉన్న కంపెనీలు ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. సాధారణంగా 25 మిలియన్ కిలోల పొగాకు సాగు చేయాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం 75 మిలియన్ కిలోల పొగాకు సాగు చేపట్టినట్లు తెలిపారు. ఇదే క్రమంలో అంతర్జాతీయ మార్కెట్లో కొంత డిమాండ్ తగ్గడమే సంక్షోభానికి కారణమని వివరించారు. మిర్చి, కొబ్బరి, బ్లాక్ బర్లీ, మామిడి పంటలు సంక్షోభంలోకి కూరుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న రైతులకు ధైర్యం కల్పించాలి, వారి కోసం కంపెనీలు బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. రైతు పక్షపాత ప్రభుత్వంగా రైతుల వెంట నిలిచిందన్నారు. ఆత్మహత్యల మాట ఈ ప్రభుత్వంలో వినపడరాదన్నారు. ధరల స్థిరీకరణ నిధికి 130కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇటీవల సంక్షోభంలోకి వెళ్లిన టమోటా రైతులను ఆ నిధి నుంచి ఆదుకున్నామన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు పంటను బయ్యర్లు ఆదివారం నుండే కొనుగోలులు ప్రారంభించాలన్నారు. ఇలాంటి పరిస్థితి రానున్న రోజుల్లో కనిపించరాదని, ప్రత్యామ్నాయ పంటల వైపుకు రైతులు వెళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు చైతన్య పరచాలన్నారు.

సంక్షోభం లాంటి ఇబ్బందులు వచ్చినప్పుడే రైతులను ఆదుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కంపెనీల ప్రోత్సాహంతోనే బ్లాక్ బర్లీ పొగాకును రైతులు సాగు చేశారని, చివరి ఆకు వరకు కొనేలా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. ఆత్మహత్యలు అనే మాట వినపడరాదు, అలాంటి ఆలోచన రైతుల్లోకి రాకూడదన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వం నిలిచిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నేపథ్యంలో కంపెనీలు ముందుకు రావాలి కోరారు. వచ్చే ఏడాది పొగాకు పంట సాగు తగ్గించేలా అధికారులు ప్రణాళికలు పొందించుకోవాలన్నారు. రైతుల బాగుంటేనే, కంపెనీలు, కంపెనీలు బాగుంటేనే మీరూ ఇలా ఒకరికొకరు సంయమనంతో ముందుకు సాగాలన్నారు. ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, మంత్రి ప్రకటించడంతో ఐటిసి 10 మిలియన్ కు మించి కొనుగోలు చేయాలని, జిపిఐ కంపెనీ 20 మిలియన్లకు పైగా కొనుగోలు చేయాలన్నారు. అలాగే మిగిలిన కంపెనీలు లక్షాలకు మించి పొగాకు కొనుగోలు చేపట్టాలన్నారు. సంక్షోభంలో ఉన్న రైతులను ప్రభుత్వం కాపాడుతుందని, ఆఖరి కిలో సైతం పొగాకు కంపెనీలు కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్ హామీ ఇచ్చారు. రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేపిస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చిందన్నారు.పొగాకు రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మంత్రి ప్రకటించిన ధరలతో కంపెనీలు ముందుకు వచ్చి పొగాకు పంటను కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియ, ధరల అమలుపై నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ప్రభుత్వం కేటాయించిన మేరకు కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయా లేదా నిరంతరం పరిశీలిస్తామన్నారు. సంక్షోభంలో ఉన్న పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. రెండు గ్రేడ్లతోనే పొగాకు కొనుగోలు జరగాలన్నారు. పర్యవేక్షణ సెల్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు సాగుతో తీవ్రంగా నష్టపోయామని, కనీస మద్దతు ధర అమలు చేయాలని ఇంకొల్లు దుద్దుకూరు రైతులు హరిబాబు, వాసు బాబు, కె వెంకట సుబ్బారావు, సూది సుబ్బారావు, మహిళా రైతు రమాదేవి, జె పంగులూరు మండలం రైతులు రావూరి రమేష్ బాబు లు కోరారు. న్యాయం చేయాలంటూ మంత్రి వద్ద అభ్యర్థించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, ఈడి విశ్వసే, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి సురేష్, సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయకుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, మార్క్ ఫెడ్ అధికారి కరుణ, ఉద్యాన శాఖ ఏడి జెన్నమ్మ, 20 కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# సమైక్య ఉద్యమానికి కలిసి రావాలి




గుంతకల్లు మే 24 (ప్రజా జ్యోతి): గుంతకల్లు పట్టణంలోని స్థానిక బి టి పక్కిరప్ప భవన్ నందు పత్రికా విలేకరులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడుతూ హంద్రీను మా పార్టీ సాధించిందని వైఎస్ఆర్సిపి నేత శివరాంరెడ్డి మరో ప్రక్క టిడిపి నేత కాల్వ శ్రీనివాసులు లేదు లేదు హంద్రీనీవాను మా పార్టీనే సాధించిందని ఒకరినొకరు సవాళు ,,ప్రతి సవాళ్లు విసురుకోవడం జరిగింది. వీరిద్దరూ హంద్రీనీవా కాలువ లోని కృష్ణా జలాలను ఉమ్మడి అనంతపురం జిల్లాలో పిల్ల కాలువలు ద్వారా (డిస్ట్రిబ్యూటరీలు) సాగునీరు సాధించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఒక సమైక్య ఉద్యమానికి కలిసి రావాలని కోరుచున్నాము. కానీ ఇంతవరకు ఆంధ్రునివా కాలువ ఉద్దేశం నెరవేరలేదు. హంద్రీనీవా కాలువ ఉద్దేశం ఏమిటంటే? దుర్భిక్ష ప్రాంతాలలో అతి తక్కువ వర్షపాతం వచ్చే ప్రాంతాలలో హంద్రీనీవా కాలువను తవ్వి దాని ద్వారా కృష్ణ జిల్లాలు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, జిల్లాలలో ఆరు లక్షల ఎకరాలకు తాగునీరు అందించాలని ప్రధాన ఉద్దేశం. కానీ ఇంతవరకు హంద్రీనీవా కాలువ పూర్తిస్థాయిలో సఫలం కాలేదు. అందుకోసమని ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు లక్షల 50 వేల ఎకరాలకు పంట పొలాలకు సాగు నీరు అందించాలి. దానికి సంబంధించిన డిస్టిబ్యూటర్ల ల పని ప్రభుత్వాలు మొదలు పెట్టాలి. కానీ ఇంతవరకు ఎక్కడ కూడా మొదలుకాలేదు. అందుకోసం ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టడానికి ఒక సమైక్య ఉద్యమానికి కాలువ శ్రీనివాసులు,శివరాంరెడ్డి సమైక్య ఉద్యమాన్ని కలిసి రావాలని పిలునిస్తున్నాం. అప్పుడే హంద్రీనీవా కాలువ పూర్తి స్థాయిలో సాఫల్యం అవుతుంది. హంద్రీనీవా కాలువలో కృష్ణ జలాలు ప్రవహించడం చూస్తున్నాము. అరకొర చెరువులకు నీళ్లు ఇస్తున్నది చూస్తున్నాం .గానీ పంటపొలాలకు నీళ్ళు ఇచ్చే దాఖలు ఎక్కడ లేవు. కాలువ వచ్చి 15 సంవత్సరాలు అవుతుంది. కానీ కాలువ ప్రధాన ఉద్దేశ్యం నెరవేరలేదు. పంట పొలాలకు నీళ్లు ఇచ్చే పనులు కాంగ్రెస్,వైఎస్సార్సీపి, తెలుగుదేశం,ఏ ప్రభుత్వాలు గానీ ఇంత వరకు చేపట్టలేదు. అందుకోసమే ప్రభుత్వం మీద ఒత్తడి తీసుకుని రావడానికి రాజకీయలకు అతీతంగా వైసీపీ, టిడిపి ,సిపిఐ ,సీపీఎం, జనసేన, కాంగ్రెస్ పార్టీ లు, రాజకీయాలకు అతీతంగా ఒక ఉద్యమాన్ని నిర్వహించాలీ నిర్వహించక పోతే ప్రభుత్వాలు స్పందించవు. అదేవిధంగా దుర్భిక్ష ప్రాంతాల పంట పొలాలకు సాగునీరు సాధించడానికి ఒక విశాల ప్రాతిపదిక పైన సమైక్య ఉద్యమం అవసరం ఉంది. హంద్రీనీవా కాలువ వెడల్పు చేసినంత మాత్రాన ఎక్కువ నీళ్లు వస్తుంది. ఆ ఎక్కువ నీళ్లు వచ్చేదాన్ని చూసి సంతోషమే గాని,మ రోపక్క బాద కూడ కలుగుతుంది.3 వేల 850 క్యూసెక్కుల నీరు కాలువ లో ప్రవహిస్తుంటే అనంతపురం జిల్లాలో లక్ష 18 ఎకరాలకు నీళు రావడం లేదు. అదేవిధంగా సత్యసాయి జిల్లాలో రెండు లక్షల 32000 ఎకరాలకు నీళ్లు రావడం లేదు. మరోపక్క కళ్యాణ్ దుర్గం నియోజకవర్గం కుందుర్పి మండలంలో 114 చెరువులకు నీళ్లు ఇవ్వడంలేదు.దానితో పాటు భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు కూడా నీళ్లు మళ్లించడం లేదు.ఇవన్నీ కూడా సాధించాలంటే ఒక సమైక్య ఉద్యమం అవసరమైంది. ప్రభుత్వంకు 12 ,15 సంవత్సరాల నుండి కాలువను ప్రవహింపజేసి అర కొరా చెరువులకు నీళ్లు ఇవ్వడం తప్ప పంట పొలాలకు నీళ్లు ఇవ్వరా? పంట పొలాలకు నీళ్లు ఇచ్చేదానికి ఈ యొక్క డిస్ట్రిబ్యూటర్ పనులు చేపట్టారా?. సత్యసాయి జిల్లాల్లో కాంక్రీట్ పనులు చేస్తున్నారు. ఇక్కడ ఏమాత్రం కాలువ వెడల్పు చేయడం లేదు. గత ప్రభుత్వం ఏమో 6వేల క్యూసెక్కులకు1 కాలువ, 4వేల క్యూసెక్కులకు మరొక కాలువ, మొత్తం పదివేల క్యూసెక్కులకు జీడిపల్లి వరకు ప్రతిపాదన చేశాము. డిపిఆర్ కూడా తయారు చేసినాము. అని గత ప్రభుత్వం చెబితే, ఈ ప్రభుత్వం ఏమో 3,850 క్యూసెక్కులు ప్రవహించే కాలువను వెడల్పు చేశాము. అది కూడా ఒక రకంగా సంతోషాల్సిన విషయం అయినా కూడా పంట పొలాలకు నీళ్లు ఇచ్చే విషయం మాట్లాడటం లేదు. అదేవిధంగా తుంగభద్ర నీళ్లు కూడా కోల్పోయినటువంటి ఆలూరు బ్రాంచ్ కెనాల్ కి, ఆ ఆయకట్టు స్థిరీకరించడానికి నీళ్లు ఇవ్వడం లేదు. గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్ ద్వారా 16 వేల ఎకరాలకు తుంగభద్ర నీళ్ళు కోల్పోయిన దానికి ఆ ఆయకట్టు స్థిరీకిరించడానికి కూడా నీరు ఇవ్వడం లేదు. మరి ఇవన్నీ సాధించాలంటే జిల్లాలో అతి తక్కువ వర్షపాతం వచ్చే ప్రాంతంలో ఒక సమైక్య ఉద్యమం అవసరముంది అందుకోసమే సవాళ్లు,ప్రతి సవాళ్లు, మానుకొని అందరూ చేయి చేయి కలిపి ఒక సమైక్య ఉద్యమం చేపట్టి అనంతపురం సత్యసాయి జిల్లాల ప్రజలకు నీళ్లు అందించే దానికి కృష్ణా జలాలు పంట పొలాలకు తరలించడానికి శ్రీకారం చుట్టాలని అందరూ కలిసి ఉద్యమం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మనవి చేస్తుంది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు,నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేశ్,పట్టణ కార్యదర్శి గోపీనాథ్,పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్,ప్రజానాట్యమండలి పట్టణ అధ్యక్షులు ప్రసాద్ పాల్గొనడం జరిగింది.

# సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ జన్మదిన వేడుకలు



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా కేకులు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసిన టిడిపి శ్రేణులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా జన్మదిన వేడుకలు పలు సేవా కార్యక్రమాలతో టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు పార్టీ కార్యాలయంలో యాళ్ల జగదీష్,కొమ్ముల కన్నబాబు నేతృత్వంలో టిడిపి శ్రేణులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.స్థానిక శివాలయంలో కూటమి నాయకులు వెలుగులు నాని, గోపిశెట్టి శ్రీను పోలిశెట్టి శ్రీను,మదినే వెంకన్న దొర,ముత్యాల రాంబాబు, రావూరి తాతాజీ,మాజీ ఎంపీటీసీ వీరబాబు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద భారీ కేక్ కట్ చేసి, గ్రామస్తులకు స్వీట్స్ పంపిణీ చేసి ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు మార్కెట్ వద్ద ఎమ్మెల్యే అభిమానులు 15 కేజీల కేక్ కట్ చేసి స్వీట్స్, మజ్జిగ ప్రజలకు పంపిణీ చేసి సంబరాలు జరిపారు.

ప్రతిపాడు మండలం టి.రాయవరం గ్రామ సర్పంచ్ తటవర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా జన్మదిన వేడుకలు నిర్వహించారు.మండలంలోని శరభవరం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు అమరాది వెంకట్రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పుట్టినరోజు వేడుకలు.కేక్ కట్ చేసి,స్వీట్స్ పంపిణీ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి శ్రేణులు తెలిపారు.

మండలంలోని ఉత్తరకంచి, వేములపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా జన్మదిన వేడుకలు ఉత్తరకంచి సర్పంచ్ మంతెన వెంకటరమణ,సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి లొండ లోవరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి తమ అభిమాన నాయకురాలు ఎమ్మెల్యే సత్యప్రభకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు శీరం శ్రీను,కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## గువ్వల చెరువు ఘాట్లో ఘోర రోడ్డు ప్రమాదం

### ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి














**బద్వేల్ మే 24 (ప్రజా జ్యోతి న్యూస్)** కడప రాయచోటి మధ్యలోని గువ్వల చెరువు ఘాట్ వద్ద ఈరోజు ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారుపై లారీ బోల్తా పడడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. వివరాలలోకి వెళితే.. కడప జిల్లా బద్వేల్ మండలం చింతపుత్తాయపల్లె గ్రామంలో ఉండే శ్రీకాంత్ రెడ్డి బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు, తమ స్వగ్రామమైన చింతపుత్తాయపల్లెలో జాతర మహోత్సవాలు జరుగుతున్నందున తమ స్వగ్రామానికి కుటుంబ సభ్యులతో బెంగళూరు నుండి చింతపుత్తాయపల్లెకు బయలుదేరారు గువ్వలచెరువు ఘాట్ లో మూడవ మలుపు వద్ద తమిళనాడుకు చెందిన లారీ వీరు ప్రయాణిస్తున్న కారుపై అదుపుతప్పి బోల్తా పడటంతో కారులో ప్రయాణిస్తున్న శ్రీకాంత్ రెడ్డి తో పాటు ఇద్దరు పిల్లలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలు తీవ్ర గాయాలతో కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటనలో దాదాపు రెండు గంటలసేపు రహదారికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న రామాపురం, చింతకొమ్మదిన్నె పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రహదారికి అంతరాయం లేకుండా చూశారు. జిల్లా ఎస్పీ సహాయక చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నాబార్డ్ నిధులతో గ్రామీణ పశు వైద్య భవనం ప్రారంబోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పితాని.



**పోడూరు /పెనుగొండమే 24,ప్రజాజ్యోతి న్యూస్. (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** నాబార్డ్ ద్వారా 2017- 18 సంవత్సరానికి గాను మంజూరైన రూ 26.5 లక్షలు నిధులతో నిర్మించబడిన గ్రామీణ పశు వైద్య కేంద్రం నూతన భవనాన్ని మాజీ మంత్రి ఆచంట శాసనసభ్యులు పీతాని సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. పెనుగొండ మండలం నడిపూడి లో ఈ భవనం నిర్మాణ కృషివర్యులు కీర్తిశేషులు మన్నే లక్ష్మీనారాయణ చౌదరిని ఈ సందర్భంగా అందరూ స్మరించుకున్నారు. స్థానికులు శ్రీ మన్యం వీర వెంకట కృష్ణారావు నెక్కంటి వరప్రసాద్ కృషిని అందరూ అభినందించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడల బేబీ అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యురాలు మామిడి శెట్టి కట్లమ్మ, మండల టిడిపి అధ్యక్షులు వెలిసేటి బాబు రాజేంద్రప్రసాద్, ఆచంట జడ్పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎల్కే సుధాకర్, సహాయ సంచాలకులు డాక్టర్ యం ప్రమీలారాణి, వైద్యులు డాక్టర్ కె భాను తేజ,స్థానిక నడిపుడి లైవ్ స్టాక్ అసిస్టెంట్ పి పోసి బాబు, మార్కెట్ యార్డ్ డి ఇ నాగమల్లేశ్వరరావు,గ్రామ టిడిపి నాయకులు కాండ్రేకుల సత్యనారాయణ, నెక్కంటి సురేష్ బాబు, అధిక సంఖ్య లో రైతు సోదరులు పాల్గొన్నారు.

## తెలుగు తేజం దివ్యతేజకు జాతీయ స్థాయిలో ఘన విజయం...

### నేషనల్ కూడో ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడల్ సాధించిన బాపట్ల క్రీడాకారుడికి ఘనసన్మానం



**బాపట్ల, మే 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** తెలుగు యువతలో ప్రతిభకు మారు పేరుగా నిలుస్తూ, బాపట్లకు చెందిన యువ కరాటే క్రీడాకారుడు దివ్యతేజ జాతీయ స్థాయిలో తన ప్రతిభను మరోసారి నిరూపించాడు. మహారాష్ట్ర పుణేలో ఈ నెల 16 నుండి 22వ తేదీ వరకు జరిగిన మూడవ నేషనల్ కూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ దక్కించుకున్నాడు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు ఆయనను ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు తెలిపారు. బాపట్ల పట్టణంలోని విజయలక్ష్మీపురం లో మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తాంద్ర మాట్లాడుతూ ఇలాంటి క్రీడాపరుల ప్రోత్సాహంతో రాష్ట్ర క్రీడా రంగానికి మరింత వెలుగు వచ్చే అవకాశం ఉంది ప్రభుత్వ మద్దతుతో ఇలాంటి ప్రతిభ దేశాన్ని కూడా ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేర్చగలదు అని ప్రశంసించారు దివ్యతేజ బాపట్ల జిల్లాలో కరాటే మరియు కూడో మాస్టర్‌గా అనేకమంది విద్యార్థులకు శిక్షణ అందిస్తూ విశేష గుర్తింపు పొందుతున్నాడు ఆయన మాజీ సైనిక కుటుంబంకు చెందినవాడవడం గర్వకారణమని పేర్కొంటూ, దివ్య తేజ తల్లి అడే రాఘవాదేవి మరియు కుటుంబ సభ్యుడు ఆడే కిషోర్లకు కూడా సన్మానం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆది శేషా రెడ్డి, సెక్రటరీ షేక్ కరిముల్లా, ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరి రావు, మాజీ సైనికులు తోట దుర్గా రావు, అబ్దుల్ రజాక్, కే.ఆంజనేయులు, వల్లూరి భావన్నారాయణ, పసుపులేటి ప్రసాద్, డి.వెంకటేశ్వర్లు, రాంప్రసాద్ రెడ్డి, బసివి రెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా దివ్యతేజను ఘనంగా సన్మానించిన సంఘ సభ్యులకు, అభినందనలు తెలిపిన అతిథులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి నిమ్మల ఆదేశాలతో ఉపాధి శ్రామికులకు మజ్జిగ పంపిణీ.

### ఎ ఉపాధి హామీ పనులను పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి పాల శారద శ్రీనివాస్.




**పాలకొల్లు మే 24 ప్రజాజ్యోతి బ్యూరో :** పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామ పంచాయితి పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో ఉపాధి శ్రామికులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలు ప్రకారం ఉపాధి శ్రామికులకు మజ్జిగ పంపిణీ చేసిన కూటమి నాయకులు, గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులువేగేశ్న శ్రీహరి రాజు, గోనేటి రామకృష్ణ, పాలపర్తి చాంద్ రాజు, నున్నబోయిన నాగరాజు, గుబ్బల ప్రసాద్ జనసేన పార్టీ అధ్యక్షులు నూకల శ్రీను, గుడిసె సురేంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాగా ఉపాధి పనులను గ్రామకార్యదర్శి పాలా శ్రీనివాస్ పరిశీలించారు.

# రంగంలోకి సర్వేయర్లు



**కరీంనగర్ :** తెలంగాణలో భూ భారతి చట్టం అమల్లోకి రావటంతో? కీలక మార్పులు రానున్నాయి. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సర్వే మ్యాప్ తప్పనిసరి చేశారు. దీంతో సర్వేయర్లు కీలకంగా మారనున్నారు. ఈ నేపథ్యంలో తొలి విడత కింద 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకువచ్చేందుకు సర్కార్ సిద్ధమైంది.భూ భారతి చట్టం అమల్లోకి రావటంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో కీలక మార్పులు రానున్నాయి. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ కింద పలు మండలాల్లో ఈ చట్టం ప్రకారమే సేవలు అందుబాటులో రాగా? త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో సేవలు ప్రారంభం కానున్నాయి. కొత్త చట్టం ప్రకారం? భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే సర్వే మ్యాప్ తప్పనిసరి. కాబట్టి?.సర్వేయర్ల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా తెలంగాణ కసరత్తు చేస్తోంది.రాష్ట్రంలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం చేపట్టాలని సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి విడత కింద ఐదు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోబోతున్నారు. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తి కాగా?. వీరందరికీ మే 26వ తేదీ నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లోనే శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.సర్వేయర్లకు ఎంపికైన వారికి రెండు నెలల పాటు వీరికి శిక్షణ ఇవ్వనున్న?రు. శిక్షణ పూర్తైన వెంటనే ఆయా మండలాల్లో భూవిస్తీర్ణం , భూ లావాదేవీలను బట్టి ఆరు నుంచి ఎనిమిది మంది సర్వేయర్లను నియమించనున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా వెల్లడించారు.రిజిస్ట్రేషన్ సమయంలో ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ దగ్గర భూములకు సంబంధించిన డాక్యుమెంట్లతో పాటు సర్వే పత్రాన్ని కూడా జత పరచాలని భూభారతి చట్టంలో పేర్కొనడం జరిగింది. ఇందుకు అనుగుణంగానే సర్వే విభాగాన్ని పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.రాష్ట్రంలో నిజాం కాలం నుంచి సర్వే జరగని ,ఇప్పటివరకు సర్వే రికార్డులు లేని 413 నక్షా గ్రామాలలో రీసర్వే చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్ , జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ , ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేశారు.ఈ ఐదు గ్రామాల్లో ముందుగా గ్రామసభలు నిర్వహించి సర్వేకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. నెలరోజుల్లో ఈ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం?. అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సర్వే విజయవంతమైన తర్వాత? రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో సర్వేకు సిద్ధమయ్యే అవకాశం ఉంది

## ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు....



**బాపట్ల మే 24 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** చనిపోవాలని ఉద్దేశంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను బాపట్ల జిల్లా మేదరమెట్ల పోలీసులు 24 గంటల లోపు గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించినారు. వివరాలలోకి వెళితే బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో నివాసముండే మామిళ్ళపల్లి శశికళ శనివారం ఉదయం మేదరమెట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. వివాహిత అయిన తన కుమార్తె వెంకట కీర్తి కనబడడం లేదని చనిపోతున్నట్లు సూసైడ్ నోట్ రాసి సెల్ఫోన్ ఇంటిలో పెట్టి ఎక్కడికో వెళ్లిపోయిందని ఫిర్యాదులో తెలిపింది. ఆమె ఫిర్యాదు అందుకున్న మేదరమెట్ల ఎస్సై రఫీ జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పి మోయిన్ సూచనలతో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసినారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఇంటి నుండి వెళ్లిపోయిన వివాహిత మహిళ ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. సోషల్ మీడియాలో మహిళా ఆచూకీ నిమిత్తం విస్తృత ప్రచారం నిర్వహించారు. కొత్తపట్నం, చిన్నగంజాం, చీరాల సముద్ర ప్రాంతాలలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మేదరమెట్ల ఎస్సై రఫీ కొత్తపట్నం సముద్ర తీరంలో కీర్తి ఆచూకీ గుర్తించినారు. వెంటనే ఆమెను సురక్షితంగా మేదరమెట్ల పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి ఆమె భర్తకు క్షేమంగా అప్పగించారు. ఫిర్యాదు అందిన వెంటనే వేగంగా స్పందించి చనిపోవాలని ఉద్దేశంతో ఇంటి నుండి వెళ్లిపోయిన కీర్తిని 24 గంటలలోపు గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించడంతో జిల్లా ఎస్పీ కి, మేదరమెట్ల పోలీస్ అధికారులకు కీర్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కాలేయం ఆరోగ్యానికి వ్యాయామాలు




శరీరంలోని ప్రతి భాగం చాలా ముఖ్యమైనది. కానీ ఈ యంత్రం ఇంజిన్ బలహీనంగా మారితే ఏం జరుగుతుంది? మన శరీరంలో కాలేయం ఎంతో ముఖ్యమైది. ఇది శరీరంలోని అతి ముఖ్యమైన, కష్టపడి పనిచేసే అవయవాలలో ఒకటి. కాలేయం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడటమే కాకుండా శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడానికి కూడా పనిచేస్తుంది. వేయించిన ఆహారాలు, ఒత్తిడి క్రమంగా కాలేయాన్ని బలహీనపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. మందుల సహాయం తీసుకునే ముందు కాలేయాన్ని లోపలి నుండి బలోపేతం చేసే కొన్ని వ్యాయామాల గురించి తెలుసుకుందాం. ఇది కాలేయానికి అత్యంత ప్రభావవంతమైన యోగా ఆసనం అని భావిస్తారు. ఈ ప్రాణాయామంలో వేగంగా గాలి వదులుతూ కడుపు లోపలికి, బయటకు కదిలిస్తూ ఉంటుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. రోజూ 5-10 నిమిషాలు కపలాభతి చేయడం వల్ల కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. కపలాభతి అనేది ఒక శక్తివంతమైన ప్రాణాయామం, దీనిలో శ్వాసను వదులుతున్నప్పుడు ఉదర కండరాలు వేగంగా సంకోచిస్తూ సడలిస్తుంటాయి. ఇది కేవలం శ్వాస ప్రక్రియ మాత్రమే కాదు, ఒక రకమైన డీటాక్స్ కూడా. కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది: కపలాభతి కడుపులోని అంతర్గత అవయవాలను సక్రియం చేస్తుంది. ఇది కాలేయంపై పేరుకుపోయిన కొవ్వును తగ్గిస్తుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది: ఈ ప్రాణాయామం కాలేయం వైపు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. కణాలు ఎక్కువ ఆక్సిజన్‌ను అందించడానికి, మెరుగ్గా పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. డీటాక్స్‌లో సహాయపడుతుంది: కపలాభతి శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగిస్తుంది. కాలేయం పనిని సులభతరం చేస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది: మానసిక ఒత్తిడి కాలేయ ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. కపలాభతి మనస్సును ప్రశాంతపరుస్తుంది. మరియు హార్మోన్లను సమతుల్యంగా ఉంచుతుంది. మీ కాలేయం ఆరోగ్యంగా ఉండాలని, జీవితాంతం వ్యాధులకు దూరంగా ఉండాలని మీరు కోరుకుంటే, ప్రతి ఉదయం కేవలం 10 నిమిషాలు కపలాభతి ప్రాణాయామం చేయడం అలవాటు చేసుకోండి. యోగ ఒక బహుమతి లాంటిది. ఇది ఎటువంటి ఖర్చు లేకుండా మిమ్మల్ని అంతర్గతంగా ఆరోగ్యంగా చేస్తుంది.

# పోషకాలు వీటిలో ఫుల్ ఉంటాయి!



బాదంలో శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. వీటిని రాత్రి నానబెట్టి ఉదయం తినడం వల్ల ఆరోగ్యానికి అనేక రకాల లాభాలు కలుగుతాయి. జీర్ణం, గుండె ఆరోగ్యం, మెదడు పనితీరు, బరువు నియంత్రణ, నిద్ర సమస్యలు వంటి వాటికి బాదం ఎంతో సహాయపడుతుంది. బాదం గింజలు ఆరోగ్యానికి చాలా మంచివి. అయితే వీటిని నానబెట్టి తింటే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పరగడుపున తింటే శరీరానికి ఎన్నో పోషకాలు అందుతాయి. రోజూ ఇలా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుంది. రాత్రి పడుకునే ముందు బాదం గింజలను నీటిలో నానబెట్టాలి. ఉదయం వాటిని నీటిలోంచి తీసి వాటిపై ఉన్న పొట్టును తీసేసి తినాలి. ఇలా తింటే బాదంలో ఉన్న పోషకాలు శరీరానికి సులభంగా అందుతాయి.నానబెట్టిన బాదంలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది. మలబద్ధకం, అజీర్ణం వంటి వాటి నుంచి ఉపశమనం కలిగించి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.బరువు తగ్గాలనుకునే వారికి బాదం మంచి ఆప్షన్. ఇందులో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు ఆకలిని నియంత్రించి ఎక్కువగా తినకుండా ఆపుతాయి. తక్కువ కేలరీలు ఉన్నా ఎక్కువ పోషణను అందించే బాదం శరీరాన్ని ఉత్సాహంగా ఉంచుతుంది.బాదంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెను కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతాయి. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున బాదం తినడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. బాదంలో ఉండే విటమిన్ ఇ, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు కణాల ఎదుగుదలకు సహాయపడతాయి. విద్యార్థులు తరచుగా దీన్ని తీసుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. బాదంలో ఉండే మెగ్నీషియం అనే ఖనిజం నరాలను ప్రశాంతంగా ఉంచి మంచి నిద్ర పట్టడానికి సహాయపడుతుంది. నిద్రలేమితో బాధపడే వారు దీన్ని తినడం వల్ల నిద్రలో మార్పును గమనించవచ్చు. రోజూ కొన్ని బాదం లను నానబెట్టి తినే అలవాటు చేసుకోవడం వల్ల ఎన్నో శారీరక, మానసిక ప్రయోజనాలు పొందవచ్చు.

# కంటి నిండా నిద్ర పట్టట్లేదా?



నిద్రలేమి సమస్య ఈ రోజుల్లో చాలా మందిని వేధిస్తోంది. సరిపడా నిద్ర లేకపోతే ఆరోగ్యంపై చాలా చెడు ప్రభావాలు పడతాయి. ఈ నిద్రలేమికి ప్రధాన కారణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకుని, ఒకే సమయానికి లేవడం శరీరానికి చాలా మంచిది. కానీ ఈ సమయాలను తరచూ మార్చడం వల్ల శరీరం గందరగోళానికి గురై నిద్ర పట్టకపోవచ్చు. అందుకే ఒకే సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి. చాలా మంది పడుకునే ముందు ఫోన్ ను ఎక్కువగా చూస్తుంటారు. ఇది మెదడును నిద్ర మోడ్ లోకి వెళ్లనివ్వదు. మొబైల్ స్క్రీన్ నుండి వచ్చే నీలి రంగు కాంతి నిద్రకు సహాయపడే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తుంది. కాబట్టి పడుకునే ముందు కనీసం ఒక గంట పాటు మొబైల్ కు దూరంగా ఉండటం మంచిది. రాత్రిపూట కాఫీ, టీ వంటి కెఫిన్ ఉన్న డ్రింక్ లు తాగడం వల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. కెఫిన్ మెదడును చురుకుగా ఉంచి నిద్రను దూరం చేస్తుంది. అందుకే సాయంత్రం తర్వాత ఈ డ్రింక్ లను తగ్గించుకోవడం మంచిది.రాత్రి సమయంలో ఎక్కువగా తింటే అజీర్తి సమస్యలు వస్తాయి. ఇది నిద్రకు భంగం కలిగిస్తుంది. నిద్రపోవడానికి కనీసం రెండు గంటల ముందు తేలికపాటి భోజనం చేయడం ఉత్తమం.రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. వ్యాయామం ఒత్తిడిని తగ్గించి మంచి నిద్ర పట్టడానికి సహాయపడుతుంది. వాకింగ్, యోగా, స్విమ్మింగ్ వంటివి మనసుకు, శరీరానికి విశ్రాంతినిస్తాయి.పగటిపూట ఎక్కువ గంటలు నిద్రపోతే రాత్రిపూట నిద్ర పట్టదు. మధ్యాహ్నం కాసేపు విశ్రాంతి తీసుకోవాలనుకుంటే, 15 నుండి 20 నిమిషాలకు మించి నిద్రపోవద్దు. సాయంత్రం 3 గంటల తర్వాత పడుకోవడం మంచిది కాదు.ప్రస్తుత బిజీ లైఫ్‌లో పని ఒత్తిడి, వ్యక్తిగత ఒత్తిడి నిద్రను దెబ్బతీస్తున్నాయి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి మెదడుకు విశ్రాంతినిచ్చే పనులు చేయాలి. ధ్యానం, యోగా, పాటలు వినడం, పుస్తకాలు చదవడం వంటివి మనసుకు ప్రశాంతతను ఇస్తాయి. నిద్రపోయే గది చాలా చల్లగా గానీ, చాలా వేడిగా గానీ ఉండకూడదు. గాలి బాగా వచ్చేలా చూసుకోవాలి. అలాగే పడుకునే మంచం కూడా సౌకర్యవంతంగా ఉండాలి. ఇవి నిద్రకు ఆటంకం లేకుండా చేస్తాయి.మద్యం సేవించడం, పొగ త్రాగడం, జంక్ ఫుడ్ తినడం వంటి అలవాట్లు నిద్రను దెబ్బతీస్తాయి. వీటిని తగ్గించి తాజా పండ్లు, కూరగాయలు, తేలికపాటి రాత్రి భోజనం వంటి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం వల్ల నిద్ర మెరుగుపడుతుంది. నిద్రలేమిని చిన్న సమస్యగా తీసిపారేయకూడదు. ఇది ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ఈ చిన్న చిన్న కారణాలను గుర్తించి వాటిని సరిచేసుకుంటే మళ్లీ చక్కటి నిద్రను పొందవచ్చు.

# క్యాన్సర్, ఊబకాయంకి దివ్యౌషధం..



ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయలలో చయోటే అదేనండీ సీమ వంకాయ ఒకటి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బాటిల్ గోర్డ్ లేదా సోరకాయ జాతికి చెందిన ఈ కూరగాయ.. పోషకాలకు మూలం. ఇది ఊబకాయం, ప్రాణాంతక క్యాన్సర్‌లను నివారించడంలో బలేగా సహాయపడుతుంది. ప్రతిరోజూ మనం వంట కోసం వివిధ రకాల కూరగాయలను ఉపయోగిస్తుంటాం.. అవి నాలుకకు రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంటాయి. అలాంటి కూరగాయలలో చయోటే అదేనండీ సీమ వంకాయ ఒకటి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బాటిల్ గోర్డ్ లేదా సోరకాయ జాతికి చెందిన ఈ కూరగాయ.. పోషకాలకు మూలం. ఇది ఊబకాయం, ప్రాణాంతక క్యాన్సర్‌లను నివారించడంలో బలేగా సహాయపడుతుంది. సీమ వంకాయలలో ఫైటోకెమికల్స్ అధికంగా ఉంటాయి. ఇవి రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలో, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే మైరిసెటిన్ కొలెస్ట్రాల్, వాపు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. సీమ వంకాయ లోప, బయటి తొక్కలో క్యాన్సర్‌ను నివారించగల యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది చర్మ క్యాన్సర్‌ను నివారించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. సీమ వంకాయకు కాలేయంలో అనవసరమైన కొవ్వు పేరుకుపోకుండా నిరోధించే సామర్థ్యం ఉంది. గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇది మంచి ఆహారం. ఎందుకంటే దీనిలోని దీ9 ప్రోటీన్ పిండం అభివృద్ధికి, ముఖ్యంగా మెదడు, వెన్నుపాము అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది అకాల జనన అవకాశాలను తగ్గిస్తుంది. అధ్యయనాల ప్రకారం సీమ వంకాయలో లుకేమియా, గర్భాశయ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ కణాల పెరుగుదలను నెమ్మదింపజేసే ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వంకాయలోని యాంటీఆక్సిడెంట్లు మరియు పోషకాలు కణాల నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. ఇది శరీరం యొక్క వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుందని అనేక అధ్యయనాలు చూపించాయి. అలాగే, ఈ వంకాయ వాపుకు దివ్యౌషధం. విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఈ కూరగాయ వర్షాకాలం, శీతాకాలంలో సాధారణంగా కనిపించే వివిధ బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి భలేగా సహాయపడుతుంది.

# వారానికి రెండుసార్లు ఇలా చేయండి



శరీరంపై వచ్చే మొటిమలు చాలా మందికి ఇబ్బంది కలిగించే సాధారణ సమస్య. ఇవి కేవలం ముఖంపైనే కాకుండా.. వీపు, భుజాలు, ఛాతీ భాగంలో కూడా వస్తుంటాయి. చెమట, మురికి, హార్మోన్లలో మార్పులు వంటివి వీటికి కారణం కావచ్చు. అయితే కొన్ని అలవాట్లను పాటిస్తే ఈ సమస్యను తగ్గించుకోవచ్చు. చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వేసవిలో చెమట ఎక్కువగా పట్టి బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి ఉదయం బయటికి వెళ్లే ముందు.. రాత్రి పడుకునే ముందు పూర్తిగా చెమట లేకుండా స్నానం చేయడం మంచిది. స్నానానికి మెత్తని బాడీ వాష్ లేదా హెర్బల్ క్లీన్సర్ వాడండి. వారానికి రెండు, మూడు సార్లు బాడీ స్క్రబ్ వాడటం వల్ల చర్మంపై పేరుకుపోయే మృతకణాలు తొలగిపోతాయి. దీనివల్ల చర్మ రంధ్రాలు శుభ్రంగా ఉంటాయి. సహజ పదార్థాలతో తయారైన స్క్రబ్ లను వాడితే చర్మానికి ఎలాంటి హాని ఉండదు.చర్మానికి గాలి తగిలేలా ఉండే దుస్తులు ధరించడం మొటిమల నివారణకు చాలా అవసరం. నైలాన్ లేదా పాలిస్టర్ లాంటి సింథటిక్ బట్టల్లో చెమట చిక్కుకుని చర్మాన్ని పాడుచేస్తుంది. అందుకే కాటన్ లాంటి సహజమైన బట్టలు వేసుకుంటే చర్మానికి గాలి బాగా ఆడుతుంది. వ్యాయామం చేశాక వెంటనే స్నానం చేయడం చాలా ముఖ్యం. వ్యాయామం వల్ల వచ్చే చెమట ఎక్కువసేపు శరీరంపై ఉంటే బ్యాక్టీరియా పెరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి జిమ్ తర్వాత వెంటనే చర్మాన్ని శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోండి. మొటిమలను తాకడం వల్ల వాటి చుట్టూ ఉన్న బ్యాక్టీరియా మరింత పెరుగుతుంది. మొటిమలను గిల్లితే చర్మంపై గాయాలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి మొటిమలను తాకకుండా ఉండటం వల్ల సమస్య మరింత తీవ్రం కాకుండా నివారించవచ్చు. రోజంతా ఎక్కువగా నీరు తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటికి వెళ్లిపోతాయి. ఇది చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. రోజుకు కనీసం రెండు నుండి మూడు లీటర్ల నీరు తాగడం వల్ల చర్మం సహజంగా మెరిసిపోతుంది.చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విటమిన్లు, మినరల్స్ ఉన్న ఆహారాన్ని రోజూ తినండి.

## బిజినెస్

### ఈ టాటా నుంచి మరో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్..




కొత్త ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ కోసం బుకింగ్‌లు వచ్చే నెల జూన్ 2 నుండి ప్రారంభమవుతాయి. అయితే వాహనం డెలివరీ ఎప్పుడు ప్రారంభమవుతుందనే దానిపై కంపెనీ ఇంకా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. టాటా మోటార్స్ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ లాంచ్ అయింది. ఈ వాహనం 2020 లో కస్టమర్ల కోసం ప్రారంభించింది. ఇప్పుడు ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ దాని మొదటి ప్రధాన అప్‌డేట్‌తో వస్తోంది. కొత్త ఆల్ట్రోజ్ కొత్త డిజైన్, కొత్త ఫీచర్లతో ప్రారంభించింది. ఈ కారులో స్మార్ట్, ప్యూర్, క్రియేటివ్, అకంప్లిష్డ్ ఎస్ మరియు అకంప్లిష్డ్ ప్లస్ ఎస్ అనే ఐదు వేరియంట్లు విడుదలయ్యాయి. భద్రత కోసం టాటా మోటార్స్ నుండి వచ్చిన ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లో 6 ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, సీట్ బెల్ట్ రిమైండర్‌తో కూడిన 3 పాయింట్ల జూ= వంటి ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. దీనితో పాటు, ఈ కారులో స్మార్ట్ డిజిటల్ స్టీరింగ్ వీల్, రిమోట్ కీలెస్ ఎంట్రీ, ఆల్ డోర్ పవర్ విండోస్, మల్టీ డ్రైవ్ మోడ్‌లు, ఐడిల్ స్టార్ట్/స్టాప్ వంటి ఫీచర్లను కంపెనీ అందించింది. 12.8 సెకన్లలో 0 నుండి 100 కి వేగవంతం అయ్యే కొత్త టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్, 200 చీఎ టార్క్ ఉత్పత్తి చేసే 1.2-లీటర్ రెవోట్రాన్ పెట్రోల్ ఇంజిన్‌తో శక్తిని పొందుతుంది. ఈ కారును 5 స్పీడ్ మాన్యువల్, 5 స్పీడ్ ఆటోమేటిక్ 6 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలతో కొనుగోలు చేయవచ్చు. 5 రంగుల ఎంపికలలో ప్రారంభించిన కొత్త టాటా ఆల్ట్రోజ్ పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో 345 లీటర్ల బూట్ స్పేస్ ఉంటుంది. అయితే జచీ+ వేరియంట్ 210 లీటర్ల బూట్ స్పేస్ కలిగి ఉంటుంది. ఇప్పుడు ఆల్ట్రోజ్ కొత్త ఫ్రంట్ గ్రిల్, కొత్త ఫ్రంట్ బంపర్, డ్యూయల్ టోన్ 16 అంగుళాల అల్లాయ్ వీల్స్, ఫ్లష్ డోర్ హ్యాండిల్స్ (సెగ్మెంట్‌లో మొదటిది) తో అందుబాటులో ఉంటుంది. ఈ కారులో జంట 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, నావిగేషన్ మ్యాప్ వ్యూతో కూడిన డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంటాయి.

### ఐటీఆర్ ఫైల్ చేస్తున్నారా?




పరిమితికి మించి ఆదాయం పొందుతున్న వారందరూ ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. రాబడి వచ్చే వ్యక్తులు, కంపెనీలు, సంఘాలు.. ఇలా అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. ఆ ఏడాదిలో సంపాదించిన ఆదాయ వివరాలు తెలియజేస్తూ ఆదాయపు పన్ను శాఖకు ఐటీఆర్ (ఇన్ కంట్యాక్స్ రిటర్న్స్) దాఖలు చేయాలి. ఆ శాఖ అధికారులు దాన్ని పరిశీలించి, మీ కట్టాల్సిన పన్నును నిర్ధారణ చేస్తారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఐటీఆర్ ను జూలై 31లోగా సమర్పించాలి. దీని కోసం ఐటీఆర్ 1 నుంచి 7 వరకూ వివిధ రకాల ఫారాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎవరు ఏ ఐటీఆర్ ఫారం సమర్పించాలో ఇప్పుడు తెలుసుకుందాం. మన దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారు లకు ఏడు రకాల ఐటీఆర్ ఫారాలను ఆదాయపు శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. వ్యక్తుల నుంచి కంపెనీల వరకూ కేటగిరీల వారీగా వీటిని వినియోగించాలి. ముఖ్యంగా తాము ఏ ఫారం సమర్పించాలో చెల్లింపుదారులకు తెలియాలి. దీని వల్ల సకాలంలో ఐటీఆర్ దాఖాలు చేయడంతో పాటు, తిరస్కరణకు గురయ్యే ప్రమాదం తప్పుతుంది. జీతం పొందే ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు, నిపుణులు తమ ఆదాయానికి అనుగుణంగా పన్ను కట్టాలి. వీరిని జనరల్, సీనియర్ (60-80 ఏళ్లు), సూపర్ సీనియర్ (80 ఏళ్లకు పైగా)గా విభజించారు. వీరిలో రూ.50 లక్షల వరకూ జీతం రూపంలో ఆదాయం పొందే వారు ఐటీఆర్-1 (సహజ్), మూలధన లాభాలు, బహుళ ఆస్తులున్న వారు ఐటీఆర్-2, వ్యాపారం, ప్రొఫెషన్ నుంచి ఆదాయం వచ్చే వారు ఐటీఆర్-3, అలాగే సెక్షన్లు 44ఏడీ, 44ఏడీఏ, 44 ఏఈ కింద ఊహాజనిత ఆదాయం కోసం ఐటీఆర్-4 (సుగమ్)ను దాఖాలు చేయాలి. హెచ్ యూఎఫ్ అంటే అవిభక్త కుటుంబం అని అర్థం. దీన్ని చట్టం ద్వారా ఏర్పాటు చేశారు.

# యూపీఐ లావాదేవీలతో క్రెడిట్ కార్డులకు బైబై




ప్రస్తుత కాలంలో డిజిటల్ చెల్లింపులు విపరీతంగా పెరిగిపోయాయి. రోడ్డు పక్కన ఉండే చిన్న బడ్డీ కొట్టు నుంచి ఫైవ్ స్టార్ హెూటళ్ల వరకూ అన్నిచోట్లా ఇవి పనిచేస్తున్నాయి. చిల్లర సమస్య లేకపోవడం, చాలా ఈజీగా చెల్లింపులు జరగడంతో ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యూపీఐ) ద్వారా స్మార్ట్ ఫోన్ ఉపయోగించి చాలా సులువుగా వీటిని జరపొచ్చు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా చెల్లింపులు జరిపే వారికి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోంది. క్రెడిట్ కార్డు ద్వారా జరిపే చెల్లింపుల కంటే చౌకగా మార్చాలని ప్రయత్నిస్తోంది. మన దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం బాగా ఎక్కువగా ఉంటుంది. నిర్ణీత ఆదాయం పొందే వారందరికీ వివిధ బ్యాంకులు వీటిని మంజూరు చేస్తున్నాయి. క్రెడిట్ కార్డులపై అనేక రాయితీలు కూడా ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలామంది క్రెడిట్ కార్డుల ద్వారా షాపింగ్ చేస్తున్నారు. అయితే క్రెడిట్ కార్డుల ద్వారా లావాదేవీలు జరిపితే ఆ వ్యాపారుల నుంచి 2 నుంచి 3 శాతం మేర మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను వసూలు చేస్తారు. ఉదాహరణకు మీరు క్రెడిట్ కార్డు ఉపయోగించి వంద రూపాయల వస్తువు కొన్నారు. ఆ మేరకు వ్యాపారస్తుడికి డబ్బులు చెల్లించారు. ఆ లావాదేవీ కారణంగా వ్యాపారులు 2 నుంచి 3 రూపాయాలను ఎండీఆర్ గా చెల్లించాలి. చాలా సందర్భాల్లో వ్యాపారులే ఆ ఖర్చును భరిస్తారు. కొందరైతే కొనుగోలుదారుడి నుంచే వసూలు చేస్తారు. కానీ యూపీఐ చెల్లింపుల ద్వారా అలాంటి చార్జీలు ఉండవు. యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను నేరుగా కొనుగోలుదారుడికే అందించడానికి వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక యంత్రాగాన్ని అన్వేషిస్తోంది. అది సక్రమంగా అమలైతే యూపీఐ యూజర్లకు మరింత ప్రయోజనం కలుగుతుంది. తద్వారా క్రెడిట్ కార్డుతో వంద రూపాయలతో కొనుగోలు చేసే వస్తువును యూపీఐ ద్వారా రూ.98కే పొందవచ్చు. దీని కారణంగా యూపీఐ లావాదేవీలు మరింత పెరిగే అవకాశం కలుగుతుంది. ఈ-కామర్స్ సంస్థలు, పేమెంట్ సేవా ప్రొవైడర్లు, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పీసీఐ), ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్), వినియోగదారుల సంఘాలతో వినియోగదారుల మంత్రిత్వ శాఖ చర్యలు జరపనుంది. జూన్ లో జరిగే స్టేక్ హెూల్డర్ల సమావేశం అనంతరం అమలయ్యే అవకాశం ఉంది.

## భారత్‌లో ఐఫోన్‌లు తయారు చేస్తే..

భారత్‌లో ఐఫోన్‌ల తయారీ ప్రయత్నాలపై ట్రంప్ మరో సారి వార్నింగ్ ఇచ్చారు. అమెరికాలో తప్ప ఎక్కడ ఐఫోన్‌లు తయారు చేసినా 25 శాతం సుంకం తప్పక విధిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు."అమెరికన్లు కొనే ఐఫోన్‌లను అమెరికాలోనే తయారు చేయాలి. ఈ విషయాన్ని నేను టిమ్‌కుక్‌తో గతంలోనే చెప్పా. ఇండియానే కాదు.. ప్రపంచంలో ఎక్కడా వీటిని తయారు చేయకూడదు. ఇది కుదరకపోతే యాపిల్ సంస్థ కనీసం 25 సుంకాన్ని అమెరికా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ధన్యవాదాలు" అని సూటిగా చెప్పేశారు. ఈ పోస్టు తరువాత యాపిల్ షేర్లు భారీ కుదుపునకు లోనయ్యాయి. ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో షేర్ల ధర 2.5 శాతం మేర తగ్గింది. యూఎస్ స్టాక్ ఫ్యూచర్స్ కూడా నష్టాల బాట పట్టాయి. ప్రత్యేకంగా ఓ కంపెనీని టార్గెట్ చేస్తూ సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి ఉందా అన్న అంశంలో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ట్రంప్ వ్యాఖ్యలపై యాపిల్ ఇంకా స్పందించాల్సి ఉంటుంది. చైనాపై ట్రంప్ భారీ సుంకాలు విధించాక యాపిల్ తన ఐఫోన్ తయారీ కార్యకలాపాలను భారత్‌లో చేపట్టేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్‌లో అమెరికాకు చేరే ఐఫోన్‌లు దాదాపుగా భారత్‌లోనే తయారవుతాయని అంతర్జాతీయ మీడియా చెబుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వివిధ రంగాలకు చెందిన తయారీ కార్యకలాపాలను అమెరికాలోనే చేపట్టాలని ట్రంప్ పట్టుబడు తున్నారు. ఈ క్రమంలోనే సుంకాల కొరడా ఝుళిపిస్తున్నారు. ఇదిలా ఉంటే.. అమెరికాలో తయారు చేసే ఐఫోన్‌ల ధరలు భారీగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ధరకు



మూడు రెట్ల మేర ఐఫోన్ ధర పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో యాపిల్ సంస్థ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత్‌లో ఇప్పటికే ఫాక్స్‌కాన్ తన తయారీ కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. 1.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సిద్ధమైంది. ప్రస్తుతం ఐఫోన్‌లను తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలోని యూనిట్‌లలో అసెంబుల్ చేస్తున్నారు.

# టీమ్‌ఇండియా టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

## స్పోర్ట్స్

ముంబయి: భారత టెస్టు క్రికెట్‌లో కొత్త శకం ప్రారంభమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ వారసుడిగా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. అందరూ భావించినట్లుగానే టెస్టు జట్టు కెప్టెన్సీ పగ్గాలను గిల్‌కు అప్పగించింది. ఈ మేరకు వచ్చే నెలలో ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. సారథిగా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌ను తీసుకుంది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది.

**టీమ్ ఇండియా జట్టు ఇదే..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్.

**కోహ్లీ స్థానంలో ఆ ఇద్దరిలో ఒకరు..**




సాయి సుదర్శన్, అర్షదీప్ సింగ్ ఈ సిరీస్‌తోనే టెస్టుల్లో ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇక, కరుణ్ నాయర్ 8 ఏళ్ల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో అడుగుపెడుతున్నాడు. చివరిసారిగా అతడు 2017 మార్చిలో టెస్టు మ్యాచ్ ఆడాడు. టెస్టు ఫార్మాట్‌కు కోహ్లీ రిటైర్మెంట్ ఇవ్వడంతో నంబరు 3లో ఎవరు వస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఆ స్థానంలో సాయి సుదర్శన్ లేదా కరుణ్ నాయర్‌ను తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. గాయంతో బాధపడుతున్న షమీతో పాటు శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌కు జట్టులో చోటు దక్కలేదు.

## కెప్టెన్ అవుతాడన్నారు.. కట్ చేస్తే! ఇప్పుడు టీమ్‌లోనే నో ఛాన్స్

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు 18 సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. కొత్త టెస్టు కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసిన బీసీసీఐ సెలక్షన్ కమిటీ.. కరుణ్ నాయర్, కుల్దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్‌లను తిరిగి పిలుపునిచ్చింది. అయితే ఛీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అండ్ కో ఎంపిక చేసిన ఈ జట్టుపై భిన్నభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను పక్కన పెట్టడాన్ని చాలా మంది తప్పుబడుతున్నారు. ఇటీవల కాలంలో అయ్యర్ దేశవాళీ క్రికెట్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. భారత్ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకోవడంలోనూ శ్రేయస్‌ది కీలక పాత్ర. అదేవిధంగా 2024-25 రంజీ ట్రోఫీ సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ కేవలం ఏడు ఇన్నింగ్స్‌లలో 68.57 సగటుతో 480 పరుగులు చేశాడు. అయ్యర్ ఫార్మాట్‌తో సంబంధం లేకుండా దుమ్ము లేపుతున్నాడు. ఐపీఎల్-2025లో కెప్టెన్‌గా, ఆటగాడిగా ఈ ముంబై బ్యాటర్ అదరగొడుతున్నాడు. అయితే గతేడాది మాత్రం అయ్యర్ టెస్టుల్లో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు.

శ్రేయస్ గత 12 ఇన్నింగ్స్‌లలో 17 సగటుతో 187 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అందుకే సెలెక్టర్లు అతడిని పక్కన పెట్టి ఫామ్‌లో ఉన్న కరుణ్ నాయర్‌ను తిరిగి జట్టులోకి తీసుకున్నారు. ఏదేమైనా ప్రస్తుత ఫామ్‌ను పరిగణలోకి తీసుకుని అయ్యర్‌ను ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేసి ఉంటే బాగుండేది అని పలువురు మాజీలు అభిప్రాయపడుతున్నారు. అయ్యర్ జట్టులో ఉంటే మిడిలార్డర్ పటిష్టంగా ఉంటుందని మరి కొందరు సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు. శ్రేయస్ అయ్యర్ అభిమానులైతే



ఒకడుగు ముందుకు వేసి సెలక్టర్లపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. కెప్టెన్ కావాల్సిన ఆటగాడికి పూర్తిగా జట్టులోనే ఛాన్స్ ఇవ్వరా అంటూ మండిపడుతున్నారు. శ్రేయస్ అయ్యర్ ఇప్పటివరకు 14 టెస్టులు ఆడి 36.86 సగటుతో 811 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లలో 5 హాఫ్ సెంచరీలతో పాటు ఒక సెంచరీ ఉంది.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్

### పోతూ పోతూ పంజాబ్‌కు షాక్..

## విజయంతో సీజన్‌ను ముగించిన దిల్లీ



జైపుర్: ఐపీఎల్ 2025ని దిల్లీ క్యాపిటల్స్ విజయంతో ముగించింది. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు దూరమైన దిల్లీ.. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్ కింగ్స్ కు షాకిచ్చింది. జైపుర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్‌పై దిల్లీ ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని దిల్లీ 4 వికెట్లు కోల్పోయి 3 బంతులు మిగిలుండగా ఛేదించింది. సమీర్ రిజ్వీ (58లిబీ 25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకం బాదాడు. కరుణ్ నాయర్ (44బీ 27 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (35బీ 21 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), ఫాఫ్ డుప్లెసిస్ (23బీ 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించగా.. సెథిఖుల్లా అటల్ (22బీ 16 బంతుల్లో 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 2, మార్కో యాన్సెన్, ప్రవీణ్ దూబె ఒక్కో వికెట్ తీశారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ భారీ స్కోరు చేసింది. ప్రియాంశ్ ఆర్య (6) నిరాశపర్చినా.. జోష్ ఇంగ్లిస్ (32బీ 12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (28బీ 18 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (53బీ 34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకం బాదగా.. చివర్లో స్టొయినిస్ (44లిబీ 16 బంతుల్లో3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. నేహల్ వధేరా (16), శశాంక్ సింగ్ (11) పరుగులు చేశారు. దిల్లీ బౌలర్లలో ముస్తాఫిజుర్ 3, కుల్‌దీప్ యాదవ్ 2, విప్రాజ్ నిగమ్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టారు.






## విశాల్ ప్రియురాలి కొత్త సినిమా.. ట్రైలర్‌లో దుమ్మురేపిందిగా


సాయి ధన్సిక పేరు ఇప్పుడు సౌత్ ఇండియా చిత్రపరిశ్రమలో బాగా వైరల్ అవుతుంది. నటుడు విశాల్‌తో ఆమె ప్రేమలో ఉండటమే ఇందుకు కారణం. తాజాగా వారిద్దరూ అధికారికంగా తమ ప్రేమ విషయాన్ని ప్రకటించారు. అయితే, తాజాగా సాయి ధన్సిక నటించిన కొత్త సినిమా 'యోగి డా' నుంచి ట్రైలర్ విడుదలైంది. గౌతమ్ కృష్ణ దర్శకత్వం వహించిన యాక్షన్ తమిళ చిత్రంలో సాయాజీ షిండే, కబీర్ దుహాన్ సింగ్ నటించారు. శ్రీ మోనికా సినీ ఫిల్మ్స్ బ్యానర్‌పై వి సెంథిల్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను విశాల్ ఫిలిం ఫ్యాక్టరీ షేర్ చేసింది. భారీ యాక్షన్ సిన్స్‌లో పోలీస్ ఆఫీసర్‌గా సాయి ధన్సిక దుమ్మురేపింది. ఈ సినిమా కోసం డూప్ లేకుండానే రియల్‌గా ఆమె స్టంట్స్ చేశారట. రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన కబాలి మూవీతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైంది ధన్సిక.. అందులో ఆయన కూతురు (యోగి) పాత్రలో మెప్పించింది. ఇప్పుడు 'యోగి డా' టైటిల్‌తో తనే ప్రధాన పాత్రలో నటించింది. త్వరలో ఈ మూవీ విడుదల కానుంది.

### సందీప్ స్కెచ్ మాములుగా లేదు..

## స్పిరిట్ కోసం యానిమల్ హీరోయిన్‌ని పట్టుకొచ్చాడుగా..!




డార్లింగ్ ప్రభాస్ ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉన్నాడు. దాదాపు అరడజను సినిమాలు ఆయన ఖాతాలో ఉన్నాయి. అయితే వీటన్నింటిలో కూడా అందరిలో ఆసక్తి పెంచుతున్న చిత్రం స్పిరిట్. ఇంకా షూటింగ్ కూడా స్టార్ట్ కాలేదు కానీ.. స్పిరిట్ గురించి ఓ రేంజ్‌లో చర్చలు జరుగుతున్నాయి. గతేడాది రిలీజైన కల్కి అరివీర భయంకర హిట్టు కొట్టడంతో.. ప్రభాస్ తర్వాత సినిమాలపై ఓ రేంజ్‌లో చర్చ నడుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ మారుతితో రాజా సాబ్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలు ఫినిష్ అయ్యాక సందీప్ రెడ్డితో 'స్పిరిట్' చిత్రం చేయనున్నారు. ఈ మూవీ పూర్తి అయ్యాక నాగ్ అశ్విన్ తో కల్కి %-% 2 , ప్రశాంత్ నీల్‌తో సలార్ 2.. అలానే యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మతో ఒక సినిమా చేయనున్నట్టు సమాచారం స్పిరిట్ చిత్రాన్ని సందీప్ ఏ జానర్‌లో తెరకెక్కిస్తాడా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఇందులో హీరోయిన్‌గా దీపిక పదుకొణేని ఎంపిక చేసినట్టు ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే దీపికా కండీషన్స్ తట్టుకోలేక ఆమె స్థానంలో యానిమల్ హీరోయిన్‌ని ఎంపిక చేశాడు సందీప్. భారీ యాక్షన్ ఎంటర్టైనర్?లో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ హీరోయిన్?గా నటించనున్నట్లు సందీప్ శనివారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. దీంతో డార్లింగ్ ఫ్యాన్స్?కు హీరోయిన్ విషయంలో క్లారిటీ వచ్చేసింది. అయితే స్పిరిట్ సినిమాకు సంబంధించి అఫీషియల్?గా ఒక అనౌన్స్మెంట్ రావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్‌లో ఉన్నారు. స్పిరిట్ అనేది ఇప్పుడు మనకు సింపుల్ వర్డ్‌లా అనిపిస్తుంది కానీ.. ఒక్క సారి సినిమా స్టార్ట్ అయ్యాక టైటిల్‌కు జస్టిఫికేషన్ అనిపిస్తుందని సందీప్ రెడ్డి వంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పాడం చూశాం. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా సందీప్ స్టార్ట్ చేసినట్లు తెలుస్తుంది. ఈ సినిమాని దాదాపు 9 భాషల్లో తీర్చిదిద్దనున్నట్లు తెలుస్తుంది. తాజాగా చిత్రంలో కథానాయిక త్రిప్తి డిమ్రీ అని అనౌన్స్ చేస్తూ ఆమె పేరును తెలుగుతో పాటు, ఇంగ్లీష్, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, చైనీస్, జపనీస్, కొరియన్ రాశారు. అంటే ఈ సినిమాని ఆ భాషలన్నింటిలో విడుదల చేయనున్నారు. ఈ సినిమాతో ప్రభాస్ రేంజ్ ఎక్కడికో వెళ్లడం ఖాయం.




## వరుణ్ తేజ్ - మేర్లపాక గాంధీ ప్రాజెక్ట్ తొలి షెడ్యూల్ పూర్తి!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హారర్-కామెడీ సినిమా నుంచి తాజా అప్‌డేట్ వచ్చింది. 'కొరియన్ కనకరాజు' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తొలి షెడ్యూల్ అనంతపురంలో విజయవంతంగా పూర్తయినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అనంతపురంలో జరిగిన ఈ షెడ్యూల్‌లో చిత్రబృందం ఒక అద్భుతమైన పాటను చిత్రీకరించింది. అంతేకాకుండా, ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన, ఆసక్తికరమైన సన్నివేశాలను షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్ పూర్తైనట్లు ప్రకటించడానికి మేకర్స్ వరుణ్ తేజ్ ఉన్న ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ ఈ జూన్‌లో కొరియాలో ప్రారంభం కానుందని సమాచారం. ఇది ఒక ఇండో-కొరియన్ ప్రాజెక్ట్ కావడంతో, కొరియాలో చిత్రీకరణ కీలకమైన భాగంగా ఉంది. ఈ చిత్రంలో రితిక నాయక్ కథానాయికగా నటిస్తుండగా, సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మాణ భాగస్వామ్యంతో, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సహకారంతో ఈ సినిమా నిర్మితమవుతోంది. అధిక బడ్జెట్‌తో, భారీ స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. వరుణ్ తేజ్ అభిమానులతో పాటు, హారర్-కామెడీ జానర్ ఇష్టపడే ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.

## 'షష్టి పూర్తి' ట్రైలర్.. మంచి ప్రయత్నం

'షష్టి పూర్తి' సినిమా ట్రైలర్ తాజాగా వచ్చేసింది. మంచి కంటెంట్‌తోనే ఈ సినిమాను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. 'లేడీస్ టైలర్' సినిమాతో మెప్పించిన రాజేంద్రప్రసాద్, అర్చన సుమారు 38 ఏళ్ల తర్వాత మరోసారి వారిద్దరూ కలిసి 'షష్టి పూర్తి' మూవీలో నటించారు. తాజాగా ఈ మూవీ నుంచి విడుదలైన ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వస్తుంది. ఈ మూవీని పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేష్ చౌదరి నిర్మించారు. ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతం అందించారు. మంచి లవ్ ట్రాక్‌తో పాటు కుటుంబ విలువలకు పెద్ద పీఠ వేసినట్లు ట్రైలర్‌లో చూస్తే అర్థం అవుతుంది. రాజేంద్ర ప్రసాద్, అర్చన జంటతో పాటు రూపేష్, ఆకాంక్షా సింగ్ యంగ్ జంటగా మెప్పించనున్నారు. మే 30న ఈ చిత్రం విడుదల కానుంది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com